V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
07-01-2025
సంపుటి : 01 | సంచిక : 246 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD



11

## ముంచిన వైరస్ భయాలు

- ₹12 లక్షల కోట్లు ఆవిరి!
- ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు.. విదేశీ మదుపర్ల అమ్మకాలతో పడిపోయిన సూచీలు



## చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ
- సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో నిర్మాణం
- రైల్వేల ఆధునికీకరణ దేశం ముఖచిత్రాన్నే మారుస్తోంది: మోడీ
- కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో తెలంగాణ మిగతా2లో...

## భద్రతా బలగాల వాహనం పేల్చివేత

- 9 మంది జవాన్లు మృతి
- భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని మందుపాతర పెట్టి పేల్చిన మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన


2



## తెలంగాణ ఆత్మీయుడికి గౌరవం

### ఆరంఘర్ పైవంతెనకు మాజీ ప్రధాని పేరు

'మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్'గా నామకరణం

- సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం
- నగర అభివృద్ధిలో భాగంగా మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉంది
- మూసీ నది పునరుజ్జీవనం జరగాల్సి ఉంది
- ఆక్రమణల వల్ల హైదరాబాద్ సుందరీకరణ దెబ్బతింటోంది
- ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయి
- హైదరాబాద్ అభివృద్ధి కోసం కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పని చేస్తోంది: సీఎం రేవంత్ రెడ్డి
- ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన

తెలంగాణ ఉద్యమం సమయం నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అందించిన సహకారాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదు.. రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి మన్మోహన్ సంపూర్ణ మద్దతు అందించడంతోపాటు.. మార్గనిర్దేశనం చేశారు. దారి చూపిన దార్శనికుడిగా ఆయనకు తెలంగాణ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన వ్యక్తులపట్ల తెలంగాణ సమాజం ఎంతటి కృతజ్ఞతాభావంతో ఉంటుందో చెప్పడానికి.. ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు గౌరవ సూచకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరాంఘర్- జూపార్క్ పైవంతెనకు 'మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్'గా నామకరణం చేసింది.

వివరాలు2లో...

## తెలంగాణలో ఓటర్లు 3.35 కోట్లు

### పురుషుల కంటే స్త్రీలే అధికం

**జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం**



**విశ్వంభర, హైదరాబాద్:** సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తంగా 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,66,41,489 మంది పురుషులు, 1,68,67,735 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

- 18 నుంచి 19 సంవత్సరాల వయసున్న ఓటర్లు - 5,45,026
- 85 సంవత్సరాలు దాటిన సీనియర్ ఓటర్లు - 2,22,091
- ఎన్ఆర్ఐ ఓటర్లు - 3,591
- ప్రత్యేక ప్రతిభావంతులు ఓటర్లు - 5,26,993
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది, అత్యల్పంగా భద్రాచలంలో 1,54,134 ఓటర్లు ఉన్నారు

## ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

- రూ.2500 రుసుముతో ఈనెల 16 వరకు అవకాశం
- తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటన



2

## పెట్టుబడులు ఆకర్షించేలా నూతన ఇంధన విధానం

- జనవరి 9న ప్రకటించనున్నాం
- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తికి అవసరమైన అంశాలను అధ్యయనం చేసి నూతన విధానాన్ని రూపొందించాం: భట్టి విక్రమార్క


2

## కారులో ప్రేమజంట సజీవ దహనం

- కారులోపలే ఉండి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య
- ఘటనాస్థలిలో 3 పేజీల లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు

2



## గురుకుల విద్యార్థి శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- వాంకిడీ ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతిచెందిన శైలజ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత
- రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేత

2

## న్యాయవాది వస్తే నష్టమేంటి?



### పోలీసులు అడ్డుకోవడంపై అసంతృప్తి

- రోడ్డుపైనే తన స్పందనను రాతపూర్వకంగా ఏసీబీ అధికారులకు అందజేత
- ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చి.. విచారణకు హాజరుకాకుండానే వెళ్లిపోయిన కేటీఆర్
- కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:**

ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గచ్చిబౌలి ఓరియన్ విల్లాకు వెళ్లిన ఏసీబీ అధికారులు.. ఈ మేరకు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు.ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. విచారణ నిమిత్తం సోమవారం ఉదయం కేటీఆర్.. ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. అక్కడ తన న్యాయవాదిని పోలీసులు అడ్డుకోవడంపై కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనతో పాటు న్యాయవాది వస్తే నష్టమేంటని ప్రశ్నించారు. దీంతో రోడ్డుపైనే తన స్పందనను రాతపూర్వకంగా ఏసీబీ అధికారులకు అందజేశారు. హైకోర్టు తీర్పు తర్వాత చట్టప్రకారం ముందుకెళ్లాలని అందులో పేర్కొన్నారు. విచారణకు హాజరుకాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులిచ్చారు. ఈ సారి న్యాయవాది సమక్షంలో ప్రశ్నిస్తారా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

**కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు తీర్పు..**

మరోవైపు ఈ-రేస్ మిగతా2లో...


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి




## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 114 | ₹ 136 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 197 | ₹ 224 |

## మన ఇళ్లపై మనమే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలి


2

- సౌర, పవన విద్యుత్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం
- వీటి కారణంగా ప్రజలపై బిల్లుల భారం తగ్గుతుంది
- ఏపీ సీఎం చంద్రబాబు



## భారత్‌లో హెచ్ఎంపీవీ వైరస్ కలకలం

- ముగ్గురికి పాజిటివ్.. కర్ణాటకలో రెండు, గుజరాత్‌లో ఒక కేసు
- ఐసీఎంఆర్ వెల్లడి
- ఆందోళన అవసరం లేదన్న కేంద్ర ఆరోగ్యశాఖ

2

## పాతబస్తీ మెట్రో భూసేకరణ..

**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ మెట్రో రైలు భూ నిర్వాసితులకు హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.741 కోట్ల వ్యయంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో లైను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్లలో మెట్రో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మెట్రో నిర్మాణంలో జర్మన్ సాంకేతికత వినియోగిస్తామని చెప్పారు. భూ నిర్వాసితులకు గజానికి రూ. 81వేల పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇవాళ 40 మందికి చెక్కుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొదటి దశలోనే పూర్తి చేయాల్సి ఉండగా.. ఆస్తుల సేకరణ, అలైన్‌మెంట్ వివాదాలతో పదేళ్లుగా నిలిచిపోయింది. దీంతో రెండో దశలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన రైట్ ఆఫ్ వే కోసం ముందుగా రహదారులు విస్తరించాలి. సర్వే చేపట్టగా 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు విడతల వారీగా జారీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారు.

## కారులో ప్రేమజంట సజీవ దహనం..

**విశ్వంభర, ఘట్‌కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారులో ఇద్దరు సజీవదహనం కేసు అనూహ్య మలుపు తిరిగింది. తొలుత ఘన్‌పూర్ సర్వీసు రోడ్డులో వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతోనే ఇద్దరు మృతి చెందారని పోలీసులు భావించారు. కానీ, వీరిద్దరూ ప్రేమ జంట అని, ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈఘటనలో మృతులను శ్రీరామ్, లిఖితగా గుర్తించారు. కారులోపలే ఉండి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నట్లు తెలుస్తోంది.ఇరుకుటుంబాల పెద్దలు పెళ్లికి అంగీకరించలేదనే ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకునే ముందు వాళ్లు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. ఘటనాస్థలిలో 3 పేజీల లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్ స్వస్థలం యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం జమ్ములపేట కాగా, యువతి మేడ్చల్ జిల్లాకి చెందినవారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

## న్యాయవాది వస్తే నష్టమేంటి?

**మొదటిపేజీ తరువాయి**

వ్యవహారంలో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై వాదనలు ముగియడంతో ఉన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. తీర్పు వెల్లడించే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్ పిటిషన్‌పై మంగళవారం ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

**ఈడీ నోటీసులపై స్పందించిన కేటీఆర్..**

ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చి.. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్‌ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది. అయితే, ఏసీబీ కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం తీర్పు వెల్లడికానుంది. ఈ నేపథ్యంలో విచారణకు సమయం ఇవ్వాలని ఈడీని.. కేటీఆర్ కోరారు. హైకోర్టు తీర్పు వెలువరించేంత వరకు సమయం ఇవ్వాలని కోరారు.

## మన ఇళ్లపై మనమే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలి

**విశ్వంభర, కుప్పం:** మన ఇళ్లపై మనమే కరెంట్ ఉత్పత్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సౌర, పవన విద్యుత్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామని.. వీటి కారణంగా ప్రజలపై బిల్లుల భారం తగ్గుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలోని నడిమూరు గ్రామంలో 'సూర్య ఘర్' సోలార్ పైలట్ ప్రాజెక్టును చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటిలో నెలకు 200 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. 60 యూనిట్లు వాడుకోవచ్చు.. మిగతా 120 యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేయొచ్చన్నారు. ఏడాదికి రూ.4వేల విలువైన కరెంట్ ఉచితంగా వినియోగించుకోవచ్చని, అదనంగా మరో రూ.5వేలు వరకు ఆదాయం వస్తుందని సీఎం వెల్లడించారు. ప్రజలు భవిష్యత్తులో కరెంట్ బిల్లు కట్టే భారం ఉండదన్నారు.

## ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

**విశ్వంభర, హైదరాబాద్:** ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును తెలంగాణ ఇంటర్ బోర్డు పొడిగించింది. రూ.2,500 అపరాధ రుసుంతో ఈ నెల 16 వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటన విడుదల చేసింది.

## పెట్టుబడులు ఆకర్షించేలా నూతన ఇంధన విధానం


**విశ్వంభర, హైదరాబాద్:** పెట్టుబడులు ఆకర్షించే విధంగా జనవరి 9న నూతన ఇంధన విధానాన్ని ప్రకటించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఎనర్జీ పాలసీతో పాటు రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తికి అవసరమైన అంశాలను అధ్యయనం చేసి నూతన విధానాన్ని రూపొందించినట్లు భట్టి తెలిపారు. తెలంగాణ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్, ఇతర పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు భట్టి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ''రాష్ట్రానికి 2030 నాటికి అవసరమైన గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 22,448 మెగావాట్ల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తోంది. విద్యుత్ సరఫరా వ్యవస్థనూ విస్తరిస్తున్నాం. తెలంగాణను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించాం. రామగుండంలో జెన్ కో, సింగరేణి సంయుక్తంగా థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిలో ఇంధన శాఖ ప్రధాన పాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కచ్చితమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నియామక ప్రక్రియ నిర్వహించి ఇప్పటికే 56వేల మందికి నియామక పత్రాలు అందించాం'' అని భట్టి వివరించారు.



# భారత్‌లో హెచ్ఎంపీవీ వైరస్ కలకలం

**ఢిల్లీ:** చైనాలో హెచ్ఎంపీవీ కలకలం సృష్టిస్తోన్న వేళ.. భారత్‌లో ఆ వైరస్‌ను గుర్తించారు. కర్ణాటకలో రెండు కేసులు వెలుగు చూసినట్లు ఐసీఎంఆర్ వెల్లడించింది. గుజరాత్‌లో ఒక కేసు నమోదైంది. బెంగళూరులో 3, 8 నెలల వయసున్న ఇద్దరు చిన్నారులకు వైరస్ నిర్ధారణ కాగా.. అహ్మదాబాద్‌లో రెండు నెలల బాలుడికి వైరస్ సోకినట్లు తేలింది. ''దేశవ్యాప్తంగా శ్వాసకోశ వ్యాధుల విషయంలో ఐసీఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా ఈ రెండు కేసులు వెలుగు చూశాయి'' అని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తిలో ఉందని, దానికి సంబంధించిన కేసులు నమోదయ్యాయని తెలిపింది. దీనిపై ఆందోళన అవసరం లేదని పేర్కొంది. కాగా.. బెంగళూరులో మూడు నెలల చిన్నారి వైరస్ నుంచి కోలుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా.. మరో చిన్నారి చికిత్స పొందుతోంది. ఇదిలాఉంటే.. రాజస్థాన్‌కు చెందిన రెండునెలల బాలుడు శ్వాసకోశ సమస్యలతో అహ్మదాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు హెచ్ఎంపీవీ పాజిటివ్‌గా గుర్తించారు. అయితే, డిసెంబర్ 26న దీనిని గుర్తించినప్పటికీ.. ఈ విషయాన్ని సదరు ప్రైవేటు ఆసుపత్రి ఆలస్యంగా తెలియజేసిందని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ వైద్యాధికారి భావిన్ సోలంకీ వెల్లడించారు. ప్రస్తుతం అతడిని ఐసోలేషన్‌లో ఉంచామన్నారు. హెచ్ఎంపీవీ బయటపడిన నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గుజరాత్ ఆరోగ్యశాఖ మంత్రి రిషికేశ్ పాటిల్ వెల్లడించారు. అయితే వైరస్ వెలుగు చూసిన దేశాల్లో వీరి కుటుంబాలు ఎలాంటి ప్రయాణాలు చేయలేదని తెలిపింది. చైనాలో కనిపించిన రకం ఇదీ ఒకటేనా..? కాదా..? తెలియాల్సి ఉంది. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారినపడే అవకాశాలు ఎక్కువ.

చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ సహా పలు శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న వార్తలతో భారత్ ఇప్పటికే అప్రమత్తమైంది. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. శీతాకాలంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగానే చైనాలో ఇన్‌ఫ్లూయెంజా, ఆర్ఎస్‌వీ, హెచ్ఎంపీవీ తరహా వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని జేఎంజీ తేల్చింది. భారత్‌లో అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ముందస్తుచర్యల్లో భాగంగా ఇప్పటికే వివిధచోట్ల ఆర్ఎస్‌ఏ, హెచ్ఎంపీవీ తదితర పరీక్షలు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఒకవేళ శ్వాసకోశ వ్యాధులు అనుకోకుండా పెరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.



# భద్రతా బలగాల వాహనం పేల్చివేత



**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. కుత్రు అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని మందుపాతర పెట్టి పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. ఐఈడీ పేలిన సమయంలో వ్యాన్‌లో 15 మంది జవాన్లు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం కుత్రు అటవీప్రాంతంలోని ఓ మార్గం వద్దకు రాగానే.. మావోయిస్టులు మందుపాతరను పేల్చారు. ఈ క్రమంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. పోలీసువాహనం తుక్కుతుక్కైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్, బీజాపూర్ సరిహద్దుల్లో పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి.. తిరిగి వెళ్తుండగా దారిలో కాపు కాసిన మావోయిస్టులు ఐఈడీని పేల్చారు. గత కొన్నాళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతను భద్రతా బలగాలు ముమ్మరం చేశాయి. శనివారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్ లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

**వారిని వదిలే ప్రసక్తే లేదు..**

ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ జవాన్ల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నక్సలిజానికి వ్యతిరేకంగా జవాన్లు బలంగా పోరాడుతున్నారని వెల్లడించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అమిత్ షా మాటిచ్చారని గుర్తు చేశారు. త్వరగా ఆయన సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మావోయిస్టులు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జవాన్ల త్యాగం వృథా పోదన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపుతామన్నారు.

# చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి , బండి సంజయ్ హాజరయ్యారు. గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్లకు పైగా పరిధి విస్తరించిందని చెప్పారు. జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని పేర్కొన్నారు.

**దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది..**

''ఒక్కో అడుగు వేసుకుంటూ దేశంలో కొత్త పుంతలు తొక్కిస్తున్నాం. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కృషి చేస్తున్నాం. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. వీటిలో స్లీపర్ వంటి సౌకర్యాలను కల్పించనున్నాం. కొత్త రైల్వే ట్రాక్‌లతో పాటు అండర్ బ్రిడ్జి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. చర్లపల్లి టెర్మినల్ ద్వారా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోంది. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయింది. వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చాం. దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది. రైల్వేల ఆధునికీకరణ దేశం ముఖచిత్రాన్నే మారుస్తోంది.'' అని మోదీ చెప్పారు.

**కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి**

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి డ్రైపోర్టు ఇవ్వాలని, ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. మెట్రో రైలు విస్తరణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.



# ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి ఎమ్మెల్సీ కవిత నివాళులు

**విశ్వంభర, ఆదిలాబాద్:** జిల్లాలోని ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఆసిఫాబాద్‌లోని దేవునిగూడ గ్రామంలోని ఆదివాసీ గోండు అక్కాచెల్లెళ్ళతో ఎమ్మెల్సీ కవిత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు చూపించిన ఆప్యాయతకు, అభిమానానికి కవిత హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. ప్రజల తరపున ఎవరు తమ గళం వినిపించినా ప్రభుత్వం వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నదని ఆమె మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రేవంత్ సర్కారు ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నదని, అందుకే ఆయనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.12 వేలకు తగ్గించి రైతులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందని కవిత విమర్శించారు.

## గురుకుల విద్యార్థి శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**విశ్వంభర, ఆసిఫాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వాంకిడీ ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతిచెందిన బాలిక శైలజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. శైలజ చిత్రపటానికి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో నిమ్స్ ఆస్పత్రిలో శైలజ చికిత్స పొందే క్రమంలో ఎమ్మెల్సీ కవిత పరామర్శించిన విషయం తెలిసిందే.చికిత్స పొందుతూ శైలజ మరణించిన విషయం తెలిసి చలించిన ఎమ్మెల్సీ కవిత ... ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు. దాంతో అప్పుడు ప్రకటించిన రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని స్వయంగా బాలిక నివాసానికి వెళ్లి అందించారు. శైలజ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ఆత్మీయుడికి గౌరవం

**విశ్వంభర, హైదరాబాద్:** ఆరాంఘర్- జూపార్కు పైవంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దీనికి మాజీ ప్రధాని 'మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్'గా పేరు పెట్టారు. నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు 4.08 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.800 కోట్లతో ఈ పైవంతెనను బల్దియా నిర్మించింది. గతేడాది డిసెంబరులో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసినా కొన్ని కారణాల వల్ల నిలిచిపోయింది. దీంతో కొన్ని రోజుల క్రితం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఫ్లైఓవర్ ప్రారంభానికి ముందుకొచ్చింది.

**మనకు మనమే పోటీ అని నిరూపించుకున్నాం: రేవంత్‌రెడ్డి**

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో వైఎస్ఆర్ హయాంలో 11.5 కి.మీ మేర అతిపెద్ద పైవంతెన ( పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్) నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. తాజాగా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోనే రెండో అతిపెద్ద పై వంతెనను నిర్మించుకొని, మనకు మనమే పోటీ అని నిరూపించుకున్నామని చెప్పారు. '' అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం. హైదరాబాద్ నగర అభివృద్ధే.. తెలంగాణ అభివృద్ధి. రోడ్ల విస్తరణ, మెట్రో నిర్మాణం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాల్సి ఉంది. నగర అభివృద్ధిలో భాగంగా మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉంది. మూసీ నది పునరుజ్జీవనం జరగాల్సి ఉంది. ఆక్రమణల వల్ల హైదరాబాద్ సుందరీకరణ దెబ్బతింటోంది. హైదరాబాద్ అభివృద్ధి కోసం కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పని చేస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయి. '' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఐఎం నేతలు, మంత్రి శ్రీధర్‌బాబు తదితర నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడటమే కాకుండా కోట్లాది రూపాయల ఇంధనం, విలువైన సమయం వృథా అవుతోంది. నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జీహెచ్ఎంసీ వ్యూహాత్మకరహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పైవంతెనలు, ఆర్వోబీలను నిర్మిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను దూరంచేస్తోంది. ఎస్ఆర్‌డీపీలోలో భాగంగా సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన జూపార్క్- ఆరాంఘర్ పైవంతెన పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత నగరంలో రెండో అతిపెద్ద వంతెన.



## డబుల్ బెడ్రూం బాధితులకు న్యాయం చేయకపోతే..

# ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

### డిప్యూటీ కలెక్టర్ మోహన్ రావుకి వినతిపత్రం ఇచ్చిన కార్మిక నాయకులు



**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** 523 సర్వే నంబర్లో తమ భూముల్ని, పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి సమర్పించి డబుల్ బెడ్రూంలు పొందుటకు అర్హులుగా నిర్ధారించబడిన వారికి తక్షణం డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం డిప్యూటీ కలెక్టర్ మోహన్ రావుకి తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య(టీఎఫ్‌టీయూ) నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా 2018లో అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ 523 సర్వే నంబర్ లోని పట్టా సర్టిఫికెట్లు కలిగిన లబ్ధిదారులందరూ తమ సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధీనపర్చాలని ఆదేశించారు. ఆ విధంగా సర్టిఫికెట్లు స్వాధీన పరిచిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాటల్ని నమ్మి ప్రజలు తమ పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధీనపరిచారు. ఈ విధంగా పట్టా సర్టిఫికెట్లు స్వాధీన పరిచిన వారిలో 887 మంది డబుల్ బెడ్రూంలు పొందుటకు అర్హులుగా నిర్ధారిస్తూ అధికారులు జాబితాను రూపొందించారు. కాని అర్హులకు డబుల్ బెడ్రూం ఇవ్వకుండా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశానుసారం సొంత ఆస్తి మాదిరిగా డబుల్ బెడ్రూంలను అర్హులు కాని వారికి పంచి పెట్టడం జరిగింది. అర్హులైన పేదలకు తీరని అన్యాయం చేశారు. అక్రమాలకు పాల్పడ్డ నాయకులపై, సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారందరికీ తక్షణం డబుల్ బెడ్రూంలు కేటాయించాలని, అర్బన్ మహబూబ్నగర్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమాలకు గురై ఉంది వాటన్నిటిని ప్రజలకు పంచి డబుల్ బెడ్రూంలు నిర్మాణం చేసి ఇవ్వాలని, డబల్ బెడ్ రూమ్ కు 15 లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎఫ్‌టీయూ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్ల యెడల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఈనెల 20 తారీకున మహబూబ్‌నగర్ అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీ విజయకుమార్, పీ యాదగిరి, జిల్లా నాయకులు జలాల్ పాషాతో పాటు ఇతర లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అందరికీ 'వేదం'అభినందనీయం...!

**- పారిశ్రామికవేత్త కె.ప్రసాద్ రెడ్డి**



**విశ్వంభర, జహీరాబాద్ :** అన్ని వర్గాల వారికి వేదం ఉచితంగా నేర్పించడం,వేద పాఠశాల కొనసాగించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ముల్తాని, కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ వినోద్ కుమార్,తో కలిసి ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు వైదిక పాఠశాల విద్యార్థులు రాజగోపురం వద్ద వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారతి నిర్వహించారు. ఆశ్రమం తరపున ప్రయాగ కుంభమేళకు వెళుతున్న సందర్భంగా అన్నదానం కొరకు రూ.50 వేల చెక్కును ఆశ్రమ పీఠాధిపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ఆశ్రమంలోని వైదిక పాఠశాలలో విద్యార్థులను అర్చకులుగా తీర్చిదిద్దుతుండడం అభినందనీయమని కొనియాడారు. వారికి ఆశ్రమ పీఠాధిపతులు మాతృశ్రీ అనసూయ మాత, 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వర స్వామి పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హెచ్ఎంపీవీ.. ప్రజలను భయపెట్టేలా ప్రచారం చేస్తే చర్యలు: దామోదర రాజనరసింహా

**విశ్వంభర, హైదరాబాద్:** హ్యూమన్ మెటానిమో వైరస్‌పై ఆందోళన అక్కర్లేదని తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా అన్నారు. 2001లో హెచ్ఎంపీవీ వైరస్‌ను గుర్తించారని తెలిపారు. శ్వాస వ్యవస్థపై వైరస్ స్వల్ప ప్రభావం చూపుతుందన్న ఆయన.. విదేశాల్లో హెచ్ఎంపీవీ కేసులు, పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలను భయపెట్టేలా ఎవరైనా ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసు..

### 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత



**విశ్వంభర, అమరావతి:** గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసులో ఇప్పటివరకు మొత్తం 89 మందిని నిందితులుగా చేర్చారు. ఇదే కేసులో ఏ71గా వల్లభనేని వంశీమోహన్ ఉన్నారు.వైసీపీ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. టీడీపీ కార్యాలయ ఆవరణలోని కారుకు నిప్పంటించారు. కార్యాలయంలోని సామగ్రిని ధ్వంసం చేశారు.

## రేషన్ బియ్యం మాయం కేసు..

# పోలీసు కస్టడీకి ముగ్గురు నిందితులు

**విశ్వంభర, అమరావతి:** రేషన్ బియ్యం మాయం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నలుగురు నిందితులను ఒక రోజు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ మచిలీపట్నం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఏ1గా పేర్ని నాని జయసుధ, ఏ6గా పేర్ని నాని ఉన్నారు. ఇదే కేసులో మానస్ తేజ్ (ఏ2), కోటిరెడ్డి (ఏ3), మంగారావు (ఏ4), ఆంజనేయులు(ఏ5)కు మచిలీపట్నం కోర్టు ఇటీవలే రిమాండ్ విధించింది. ఈ కేసులో ఏ3గా ఉన్న పౌరసరఫరాల శాఖ అధికారి కోటిరెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోటిరెడ్డిని మినహాయించి ఏ2, ఏ4, ఏ5గా ఉన్న నిందితులను పోలీసులు మంగళవారం కస్టడీకి తీసుకోనున్నారు.కేసు దర్యాప్తులో భాగంగా రిమాండ్‌లో ఉన్న నిందితులను వారం రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేసిన కోర్టు.. ఒక రోజు కస్టడీకి అనుమతి ఇచ్చింది. మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిందితులను ప్రశ్నించనున్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన మచిలీపట్నం కోర్టు.. విచారణకు సహకరించాలని ఆదేశించింది. ఇదే కేసులో ఏ6గా ఉన్న పేర్నినాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

## అమరచింతలో బ్యాంకు దోపిడీకి విఫలయత్నం..

**- భార్యాభర్తలు సహా ఐదుగురి అరెస్ట్**



**విశ్వంభర, వనపర్తి :** వనపర్తి జిల్లా అమరచింతలోని యూనియన్ బ్యాంక్‌లో దొంగతనానికి ప్రయత్నించిన భార్యాభర్తలు, వారికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి బ్యాంకులోని డిజిటల్ వీడియో రికార్డర్, హ్యుందాయ్ క్రెటా కారును స్వాధీనం చేసుకున్నారు. 2024 డిసెంబర్ 30న అమరచింత యూనియన్ బ్యాంకు మేనేజర్, సిబ్బంది బ్యాంకు తెరిచినప్పుడు స్ట్రాంగ్ రూమ్ హ్యాండిల్ విరిగిపోవడం, బాత్ రూం పక్క కిటికీ అద్దాలు పగిలిపోవడం, సీసీటీవీ కెమెరాల డీవీఆర్ వైర్లు కత్తిరించి ఉన్నాయి. కిటికీల ఐరన్ గ్రిల్స్ ఊడిపోయాయి. దీంతో అప్రమత్తమైన మేనేజర్ స్ట్రాంగ్ రూమ్ తెరిచి చూడగా నగదు, బంగారం ఆభరణాలు, ఇతర డాక్యుమెంట్లు అలాగే ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో బ్యాంకులో చొరబడి దొంగతనం చేయాలని ప్రయత్నించారు. ఇందుకోసం సీసీటీవీ కెమెరాల్లో తమ ఫోటోలు నిక్షిప్తం కాకుండా డిజిటల్ వీడియో రికార్డర్ వైర్లు కత్తిరించి డీవీఆర్ ఎత్తుకెళ్లారు. దాని విలువ రూ.8,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

పసుల అంకిత అనే మహిళ బీటెక్ పూర్తి చేసింది. పెండ్లికి ముందు దక్షిణ మధ్య రైల్వేలో టికెట్ కౌంటర్ మేనేజర్ జాబ్ ఇప్పిస్తానని సాయి నివాస్ అనే వ్యక్తి పసుల అంకిత వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు కానీ, ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో మోసపోయానని భావించిన పసుల అంకిత తన ఉద్యోగం తాను చేసుకుంటూ బతుకుతున్నది. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడింది. తన జల్సాలకు వేతనం సరిపోవడం లేదు కనుక తాను మోసపోయినట్లే ఇతరులను తానూ మోసగించింది. గద్వాలకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి (ఒక్కొక్కరి నుంచి రూ.6లక్షలు) రూ.18 లక్షలు తీసుకుని జల్సాగా గడిపింది. గోవా, బెంగళూర్‌లో టూర్లు వేసింది. 2022లో రాచాల జగదీశ్వర్‌రెడ్డితో ఆమె పెండ్లి జరిగింది. తర్వాత తన భర్త కట్టిన ఇంటికి, పెండ్లికి అప్పు అయ్యింది. దీనికి తోడు గతంలో మోసపోయిన ముగ్గురు గద్వాల వాసులు ఆమెపై గద్వాల టౌన్, ఐయిజ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. తాను తప్పు చేశానని, వారికి ఎలాగైనా డబ్బు చెల్లించాలని ఆమె కోరడంతో భర్త అంగీకరించాడు. అంత డబ్బు ఎక్కడ దొరుకుతుందీ అని ఇద్దరు చర్చోపచర్చలు జరిపి బ్యాంకు దోపిడీకి ప్లాన్ చేశారు. ఇందుకోసం పసుల అంకిత, ఆమె భర్త రాచాల జగదీశ్వర్ రెడ్డితోపాటు రాచాల భాస్కర్ రెడ్డి, మంద నాగరాజు, గణేశ్ రంగంలోకి దిగారు. రాచాల భాస్కర్‌రెడ్డి, మంద నాగరాజు, గణేశ్‌లకు డబ్బాశ చూపారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం పసుల అంకిత హ్యుండాయ్ క్రెటా కారులో గద్వాల, నారాయణపేట, మరికల్ ప్రాంతాల్లోని బ్యాంకులను పరిశీలించారు. అక్కడ బ్యాంకు దోపిడీ చేయడానికి వీలు కాదని తేలిపోవడంతో 2024 డిసెంబర్ 27వ తేదీ రాత్రి అమరచింత మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో దొంగతనం చేయాలని ప్రయత్నించారు. బ్యాంకు వెనుక కిటికి గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించారు. బ్యాంకు లాక్ స్ట్రాంగ్ రూమ్ తలుపును తమతో తెచ్చుకున్న గడ్డపార, మంకీ స్పానర్, ఐరన్ పైప్‌తో పగలగొట్టడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. తమ ప్రయత్నం విఫలం కావడంతో సీసీటీవీ కెమెరాల ద్వారా దొరికిపోతామని భావించి సీసీటీవీ కెమెరాలకు అనుసంధానించిన డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) ఎత్తుకెళ్లారు. కానీ, బ్యాంకులో బంగారం, నగదు, డాక్యుమెంట్లు, ఇతర వస్తువులు అలాగే ఉన్నాయి.

నేరస్తులను పట్టుకోవడానికి వనపర్తి ఐపీఎస్ అధికారి రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆత్మకూర్ సీఐ శివకుమార్, అమరచింత ఎస్ఐ సురేష్, సీసీఎస్ విభాగం సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. టెక్నాలజీ సాయంతో తనిఖీ చేస్తున్నారు. ఈ నెల ఐదో తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అమరచింతలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హ్యుండాయ్ క్రెటా కారులో వెళుతున్న ఐదుగురు నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారని వనపర్తి ఎస్పీ తెలిపారు.

## ఆకాష్ మినిగాల కవిత్వం ఆవిష్కరణ




**విశ్వంభర, హైదరాబాద్:** యవకుడు ఆకాష్ చదువుకుంటూ ఇష్టమైన గురువు గోపాల్ వద్ద కవిత్వం నేర్చుకుంటూ తన చుట్టూ వున్న పేదరికం, ఆ వాతావరణం, వారి స్థితి గతుల నడవడిక, కష్ట నష్టలను తనకు తోచిన విధంగా కవిత్వం రాయడం మొదలు పెట్టాడు చిన్న చిన్న కవితలు రాస్తు పత్రికలకు పంపిస్తు పలువురి మన్నలను అందుకుంటు ఈ మధ్యలో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం పొందాడు. వారి కొత్త ఇల్లు నిర్మాణం జరుగుతున్న సమయం లో కరెంటు షాక్ తో ప్రమాదవ శాత్తు మరణించాడు. అతని కళ, తాను రాసిన కవితలను పుస్తకం రూపం లో తీసుకు రావాలాన్న కోరికను ఆకాష్ మిత్రులు నిజం చేస్తూ, ఆకాష్ కు ఇదే మా నిజమైన నివాళి అంటూ హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా నిలయం లో స్వర్గీయ ఆకాష్ రాసిన కవితల సంకలనం ను ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అతని తల్లి దండ్రులు లక్ష్మి, లక్ష్మణ్, అన్నా రాకేష్ ల చేతులమీదుగా ఆవిష్కరణ చేయించారు. కార్యక్రమంలో కవులు ఆనందాచారీ, యాకుబ్, మోహన కృష్ణ లు మాట్లాడుతూ ఆకాష్ లేకున్నా అతని కవితలు మనం నిత్యం చదివే విధంగా, చదివించే విధంగా ఉండడం తో నిత్యం ఆకాష్ మన అందరి వెంట వున్నట్టే అని తల్లి దండ్రులకు భరోసానిచ్చారు.

## సామాన్యుల గొంతుకగా డిజిటల్ మీడియా





**విశ్వంభర, హైదరాబాద్:** బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డీఎంజేయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజాస్వామ్యం డిజిటల్ మీడియా పాత్ర అంశం పై రౌండ్ టేబుల్ సమావేశంను సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహిచడం జరిగింది. ఈ సమావేశం కు సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాఢభూషి శ్రీధర్, ఓయూ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, తెలంగాణ సోషల్ మీడియా ఫోరమ్ కన్వీనర్ దేశాయి కరుణాకర్ రెడ్డి, డీఎంజేయూ జాతీయ గౌరవ అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జానకి రెడ్డి తో పాటు పలువురు జర్నలిస్టులు, ప్రజా విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు..ఈరోజు డిజిటల్ మీడియా సమాజాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. డిజిటల్ మీడియా అణగారిణ ప్రజల గొంతుకగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిజిటల్ మీడియా కు చట్టబద్ధత కల్పించి డిజిటల్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంను కోరారు. డీఎంజేయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కే రాజేంద్ర ప్రసాద్, బొడ్డు అశోక్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.



మీర్పేట శ్లోక పాఠశాలలో చదివే విద్యార్థిని చరిత రెడ్డి స్టేట్ లెవెల్ ఎస్ జీ ఎఫ్ సైక్లింగ్ టోర్నమెంట్లో రాష్ట్రస్థాయి అండర్- 14 లో మొదటి స్థానం గెలిచి గోల్డ్ మెడల్ విజయంతో ఈనెల 17న జార్ఖండ్ నేషనల్ అండర్ 14 ఇయర్స్ విభాగంలో ఎంపికైనది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు.
(విశ్వంభర, మీర్ పేట్)



హైదరాబాద్ అంబర్ పేట్ డివిజన్ లోని అర్బన్ కమిటీ హెల్త్ సెంటర్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి డయాలసిస్ సెంటర్ ప్రారంభించారు.
(విశ్వంభర, అంబర్ పేట్)








> పన్నెండేళ్లకోసారి జరిగే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. 45 రోజులపాటు ఉత్సవంలా సాగే ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మందికిపైగా వస్తారని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీన్ని ఘనంగా నిర్వహించేందుకు భారీ ప్రణాళికతో సిద్ధమవుతోంది. మరో వారం రోజుల్లో మహా కుంభమేళా జరగనున్న నేపథ్యంలో విశ్వంభర ప్రత్యేక కథనం..

## పాపాలు తొలగించే పవిత్ర సమయం..

# మహా కుంభమేళా 2025

**ఇది ఆధ్యాత్మిక జ్ఞానం,**
**సామాజిక సామరస్యానికి ముఖ్యమైన వేదిక**
**జనవరి 13 నుంచి ప్రారంభం**

హిందూ క్యాలెండర్ ప్రకారం, పుష్కర కాలానికి(12 ఏళ్లకు) ఒకసారి మహా కుంభమేళా నిర్వహిస్తారు. ఈ మహా కుంభమేళాను 'పూర్ణ కుంభం' అని కూడా అంటారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు, సాధువులు హాజరవుతారు. మన దేశంలో ప్రయాగ్‌రాజ్‌తో పాటు హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లోనూ కుంభమేళా నిర్వహిస్తారు. అయితే వీటన్నింట్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే కుంభమేళాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రయాగ్‌రాజ్‌లోనే గంగా, యమునా, కనిపించని సరస్వతి నదుల సంగమం జరుగుతుంది. దీన్నే త్రివేణి సంగమంగా పిలుస్తారు. మహా కుంభం వేళ గంగా నదిలో స్నానం చేయడం వల్ల కచ్చితంగా మోక్షం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. అంతేకాదు సకల పాపాలన్నీ తొలగిపోతాయనే విశ్వాసంతో కోట్లాది మంది భక్తులు దేశ, విదేశాల నుంచి తరలివస్తారు. ఈ కుంభమేళా కార్యక్రమం జనవరి 13వ తేదీ నుంచి దాదాపు నెలరోజుల పాటు అంటే ఫిబ్రవరి 26వ తేదీ వరకు సాగుతుంది.

**పన్నెండేళ్లకు ఒకసారి మాత్రమే ఎందుకు?**

మహాకుంభమేళా పన్నెండేళ్లకు ఒకసారి మాత్రమే జరుపుకోవడం వెనుక పౌరాణిక గాథలు, మత విశ్వాసాలు ఉన్నాయి. పోతనామాత్యుడు రచించిన మహా భాగవతం ప్రకారం క్షీరసాగర మధనంలో దేవతలు, రాక్షసులు కలిసి సముద్రాన్ని మధనం చేసినప్పుడు అమృతం ఉద్భవించింది. ఈ అమృతాన్ని పొందడానికి దేవతలు, రాక్షసుల మధ్య 12 దివ్య రోజుల పాటు యుద్ధం జరిగింది. ఈ 12 దివ్య రోజులు భూమిపై 12 సంవత్సరాలకు సమానమని నమ్మకం. ఈ సమయంలో అమృత భాండం నుంచి ఇవి కుంభమేళాకు ప్రదేశాలుగా మారాయి. "కుండ" అని అర్థం వచ్చే "కుంభ్" అనే పదం, ఈ అమృతాన్ని పట్టుకున్న వస్తువు అని సూచిస్తుంది, ఇది పండుగను ఖగోళ మరియు ఆధ్యాత్మిక పోషణతో కలుపుతుంది.

**సైన్స్ ఏమి చెబుతుంది?**

శాస్త్రీయ దృక్కోణం నుండి, కుంభమేళా ఖగోళ శాస్త్రం మరియు మానవ జీవశాస్త్రంపై దాని ప్రభావాలపై అధునాతన అవగాహనను ప్రతిబింబిస్తుంది. గ్రహాల అమరికలు భూమి యొక్క విద్యుదయస్కాంత క్షేత్రాలను ప్రభావితం చేయగలవని పరిశోధనలు సూచిస్తున్నాయి, ఇవి జీవ వ్యవస్థలను ప్రభావితం చేస్తాయి. జీవ అయస్కాంతంపై అధ్యయనాలు మానవ శరీరాలు విద్యుదయస్కాంత శక్తులను విడుదల చేస్తాయని మరియు వాటి వాతావరణంలో చార్జ్ చేయబడిన క్షేత్రాలకు ప్రతిస్పందిస్తాయని సూచిస్తున్నాయి.పండుగ నిర్దిష్ట గ్రహాల అమరికల ద్వారా నిర్ణయించబడుతుంది, బృహస్పతి ప్రధాన పాత్ర పోషిస్తుంది. సూర్యుని చుట్టూ బృహస్పతి యొక్క 12 సంవత్సరాల కక్ష్య శుభ సమయాలను సూచించే నిర్దిష్ట రాశి సంకేతాలతో క్రమానుగతంగా సర్దుబాటు చేస్తుంది.బృహస్పతి సూర్యుడు మరియు చంద్రుని స్థానాలతో సమానంగా ఒక నిర్దిష్ట అమరికలోకి ప్రవేశించినప్పుడు మహాకుంభ మేళా జరుగుతుంది. ఈ అమరిక భూమి యొక్క విద్యుదయస్కాంత క్షేత్రాలను విస్తరిస్తుందని నమ్ముతారు.బృహస్పతి డిసెంబర్ 7,2024 న వ్యతిరేకతను చేరుకుంది, భూమి గ్రహం మరియు సూర్యుడి మధ్య సరిగ్గా ఉంది. ఈ సంఘటన రాత్రి ఆకాశంలో బృహస్పతిని ప్రకాశవంతంగా ప్రకాశింపజేసింది. ఇది ముఖ్యంగా జనవరి 2025 లో కొనసాగుతుంది, ఎందుకంటే ఇది నెలలో ఎక్కువ భాగం కనిపిస్తుంది, అర్ధరాత్రి చుట్టూ గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. రాబోయే రెండు వారాల్లో, నాలుగు గ్రహాలు-శుక్రుడు, శని, బృహస్పతి మరియు కుజుడు-సూర్యాస్తమయం తరువాత వెంటనే ప్రముఖంగా కనిపిస్తాయి, ఇది పరిశీలకులకు అద్భుతమైన ప్రదర్శనను సృష్టిస్తుంది. కుంభమేళా ప్రదేశాల ఎంపిక భౌగోళికం మరియు భౌగోళిక అయస్కాంత శక్తులపై ప్రాచీన భారతదేశానికి ఉన్న లోతైన అవగాహనను వెల్లడిస్తుంది.ఈ ప్రదేశాలు, తరచుగా నదీ సంగమాల వద్ద, బలమైన భౌగోళిక అయస్కాంత శక్తి క్షేత్రాలను ప్రదర్శిస్తాయని నమ్ముతారు. పురాతన ఋషులు ఈ ప్రాంతాలను ఆధ్యాత్మిక వృద్ధికి అనువైనవిగా గుర్తించారు, పండుగ సమయం మరియు ప్రదేశాలను నిర్ణయించడానికి భూమి యొక్క శక్తి వ్యవస్థల గురించి వారి జ్ఞానాన్ని పెంచుకున్నారు. 2025 మహాకుంభ మేళా కోసం ప్రపంచం ఎదురుచూస్తున్నందున, ఈ కార్యక్రమం విశ్వంతో మానవాళికి శాశ్వతమైన సంబంధానికి సంబంధించినది. ఇది విశ్వాసం, పురాణాలు మరియు శాస్త్రీయ సూత్రాల యొక్క ప్రత్యేకమైన సమ్మేళనం, ఇది మానవ జీవితంపై విశ్వం యొక్క ప్రభావం గురించి లోతైన ప్రశంసలను అందిస్తుంది.

**జ్యోతిష్య శాస్త్రం ఏమి చెబుతోంది?**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం గురు గ్రహం 12 సంవత్సరాలలో 12 రాశుల చుట్టూ తిరుగుతుంది. గురు గ్రహం ఒక నిర్దిష్ట రాశిలో ఉన్న సమయంలో కుంభమేళా నిర్వహిస్తారు.

**ఆధ్యాత్మిక శాంతి..**

మహా కుంభం ప్రాముఖ్యత కేవలం మతపరమైన ఆచారాలకే కాదు. ఇది ఆధ్యాత్మిక జ్ఞానం, సామాజిక సామరస్యానికి ముఖ్యమైన వేదిక. కుంభమేళా భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తుంది. అంతేకాదు జీవితంలో లోతైన రహస్యాలను అర్థం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. అందుకే మహా కుంభమేళాలో గంగా స్నానం చేసే భక్తులందరూ తప్పనిసరిగా మత సంప్రదాయాలను, నియమాలను పాటించాలి. ఈ పవిత్రమైన అవకాశాన్ని అందరూ పూర్తిగా సద్వినియోగం చేసుకుని పుణ్యకార్యంలో భాగస్వాములవ్వండి.

**కుంభమేళాలో పవిత్ర స్నానం**

పవిత్రమైన ఈ మహా కుంభ మేళాలో పవిత్ర స్నానానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ శుభ సమయంలో గ్రహాలు, నక్షత్రాల సంగమం అంతా పవిత్ర జలంలో వచ్చి చేరుతుంది. ఈ సమయంలో స్నానాలు చేసిన వారికి చంద్రుడు తదితర గ్రహాల అనుగ్రహం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. అంతేకాదు ఆరోగ్యం, ఐశ్వర్యంతో సహా ఎన్నో సత్ఫలితాలు ఉంటాయని విశ్వాసం. అయితే కుంభమేళాలో ఆచరించే స్నానాలలో రకాలు కూడా ఉన్నాయి. అవేమిటో చూద్దాం.

**రాజ స్నానం**

- కుంభమేళాలో చేసే స్నానాలలోకెల్లా అత్యంత పవిత్రమైనదిగా భావించే రాజ స్నానం 13 జనవరి 2025 న పుష్య పౌర్ణమి రోజున నిర్వహించనున్నారు.
- రెండో రాజ స్నానం మకర సంక్రాంతి 14 జనవరి 2025 రోజున చేస్తారు.
- మూడో రాజ స్నానం 2025 జనవరి 29న మౌని అమావాస్య రోజున చేస్తారు.
- నాలుగో రాజ స్నానం వసంత పంచమి, 3 ఫిబ్రవరి 2025 రోజున చేస్తారు.
- ఐదో రాజ స్నానం మాఘ పూర్ణిమ, 12 ఫిబ్రవరి 2025 రోజున చేస్తారు.
- 2025 ఫిబ్రవరి 26న మహాశివరాత్రి రోజున చివరి రాజ స్నానం చేస్తారు.

**రాజ స్నానం ప్రాముఖ్యం ఏమిటి?**

మహాకుంభమేళాలో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 న మహాశివరాత్రి వరకు కూడా పుణ్య స్నానాలు ఆచరిస్తారు. అయితే ఇందులో విశేషంగా చేసే రాజ స్నానానికి ఓ ప్రాముఖ్యత ఉంది. సాధారణంగా పుణ్య తిథుల్లో నదీస్నానం విశేషంగా చేస్తారు. ఇక మహాకుంభమేళా లో వచ్చే విశేష తిథుల్లో స్నానం చేయడాన్ని రాజస్నానంగా చెబుతారు. కుంభమేళాలో స్నానం చేయడం వల్ల సకల దేవతల ఆశీస్సులు లభిస్తాయని, సమస్త పాపాలు నశించి మోక్షం లభిస్తుందని విశ్వాసం.

**స్నానం మాత్రమే కాదు..**

మహా కుంభమేళాలో గంగా నదిలో కేవలం స్నానం మాత్రమే కాదు.. సంయమనం, భక్తి, మతపరమైన నియమాలను పాటించడం తప్పనిసరి. అందుకే మహా కుంభ మేళా సమయంలో గంగాస్నానం చేసే ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో వారు అనేక ప్రయోజనాలు పొందుతారని పండితులు చెబుతున్నారు. అంతేకాదు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటారు. మహా కుంభమేళా సమయంలో చేసే గంగా స్నానానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. హిందూ మత విశ్వాసాల ప్రకారం, మహా కుంభం సమయంలో కనీసం ఐదు సార్లైనా గంగలో మునగాలి. అనంతరం స్నానం చేయాలి. లేదంటే మీరు చేసిన స్నానం అసంపూర్ణంగా పరిగణించబడుతుంది.

**ఇవి గుర్తుంచుకోండి..**

మహా కుంభ మేళాలో స్నానం చేసే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోండి.వరైనా సరే సాధువులు స్నానం చేసే సమయంలో వారి ఎదుట స్నానం చేయకూడదు. ఎందుకంటే కుంభమేళా సమయంలో స్నానానికి సాధువులు, ఋషులు స్నానానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. పొరపాటున ఎవరైనా సాధువులు చేసే సమయంలో స్నానం చేస్తే, మీకు పుణ్యానికి బదులుగా పాపాలు ఎదురవుతాయి. మహాకుంభ మేళా సందర్భంగా, పవిత్రమైన స్నానం చేయడమే కాదు మీ శక్తి సామర్థ్యాలకు తగ్గట్టు దానధర్మాలు చేయాలి. ఇలా చేయడం వల్ల మీకు శుభ ఫలితాలొస్తాయి.

**భద్రత విషయంలో రాజీ పడకుండా..**

భద్రత విషయంలో రాజీ పడకుండా 50 వేల మంది సిబ్బందిని మోహరించనుంది. నిరంతర నిఘా కోసం తొలిసారిగా నీటిలోపల 100 మీటర్ల లోతులోని వస్తువులను సైతం గుర్తించే సామర్థ్యం కలిగిన అండర్ వాటర్ (జలాంతర) డ్రోన్లను ఉపయోగించనున్నారు. కుంభమేళా కోసం కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన 2,700 సీసీ కెమెరాలతో 24 గంటలూ రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించేలా అత్యాధునిక మల్టీ డిజాస్టర్ రెస్పాన్స్ వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు. మరోవైపు, 'నేత్ర కుంభ్' శిబిరం ద్వారా 5 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహా కుంభమేళాకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందించేందుకు యూపీ ప్రభుత్వం 2వేలకు పైగా డ్రోన్లతో భారీ డ్రోన్ షోను కూడా ఏర్పాటు చేస్తోంది. మరోవైపు, కుంభమేళా యాత్రికుల కోసం మరో 12 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. 2025 జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22 తేదీల్లో తిరుపతి-బనారస్ (07107), ఫిబ్రవరి 20, 10, 17, 24 తేదీల్లో బనారస్- విజయవాడ (07108) రైళ్లను నడుపనున్నారు.'

**ఏడంచెల భద్రత ఇలా..**

కుంభోత్సవాలకు యూపీ ప్రభుత్వం ఏడెంచల భద్రత కల్పిస్తున్నది. తొలి రౌండ్‌లో ఆరిజిన్ పాయింట్ వద్ద తనిఖీలు చేపడుతారు. రెండోరౌండ్‌లో రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేస్తారు. మూడోరౌండ్ రాష్ట్ర సరిహద్దుల వద్ద సమగ్రంగా తనిఖీలు జరుగుతాయి. నాల్గో రౌండ్‌లో జోన్ సరిహద్దులు, టోల్ ప్లాజాల వద్ద సోదాలు సాగుతాయి. ఐదోరౌండ్‌లో ప్రయాగ్‌రాజ్ కమిషనరేట్ సరిహద్దులో తనిఖీలు చేస్తారు. ఆరవ అంచెలో ఔటర్ ఫెయిర్ ఏరియాలో తనిఖీలు, ఏడో రౌండ్‌లో ఇంటీరియర్, ఐసోలేషన్ కార్డెన్ సెర్చ్‌లు కొనసాగుతాయి. 2025 మహా కుంభానికి హాజరయ్యే భక్తుల భద్రత కోసం మొత్తం 37,611 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. వీరిలో మహా కుంభమేళా ప్రాంతానికి 22,953 మంది పోలీసులు, కమిషనరేట్‌కు 6,887 మంది, జీఆర్‌పీకి చెందిన 7,771 మంది పోలీసులను నియమించనున్నారు.

అదే సమయంలో మహిళా భక్తుల భద్రత కోసం 1,378 మంది మహిళా పోలీసులను నియమించనున్నారు. గత కుంభమేళా కంటే ఈ సారి భారీ సంఖ్యలో పోలీసులను మోహరిస్తున్నారు. 2013 మహాకుంభమేళాలో 22,998 మంది పోలీసులను మోహరించగా.. గతంలో పోలిస్తే 14,713 మందిని అదనంగా నియమించనున్నారు. 2019 అర్ధ కుంభ్‌మేళాలో 27,550 మంది పోలీసులతో పోలిస్తే 10,061 మంది పోలీసులను అదనంగా వినియోగిస్తున్నారు. ఇందులో సివిల్ పోలీసులు 18479 మంది, మహిళా సిబ్బంది 1,378 మంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది 1,405 మందిని వినియోగించనున్నారు. ఇక సాయుధ పోలీసులు 1158, మౌంటెడ్ పోలీస్ 146 మంది, రవాణా శాఖ నుంచి 230 మంది, ఎల్ఐయుకు 510 మంది, వాటర్ పోలీస్ 340 మంది, హోంగార్డులు 13,965 మందిని మోహరిస్తారు. ఇంటెలిజెన్స్ యూనిట్ నిమిషానికో నివేదిక అందించనున్నది.

**భద్రత వ్యూహం సిద్ధం**

మహాకుంభ్ 2025 భద్రత పరంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నిర్భయంగా యాత్రను పూర్తి చేసుకొని తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో పాటు, ప్రయాగ్‌రాజ్‌కు చేరుకునే ప్రతి వ్యక్తి కార్యకలాపాలకు సంబంధించి భద్రతా సిబ్బంది పూర్తి నిఘా వేసి ఉంచనున్నారు. వివిధ విభాగాల పోలీసులు స్థానిక నిఘా విభాగాలతో నిరంతరం టచ్‌లో ఉంటూ పర్యవేక్షిస్తారు. కుంభమేళ సమయంలో 10 రకాల బందోబస్తును కూడా నిర్వహిస్తారు. దీంతో భక్తులు అడుగడుగునా రక్షణ లభించనున్నది. ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్ (ICCC) ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో కూడిన సీసీటీవీ కెమెరాల ద్వారా ఫొటోలు, గుర్తింపు, టీఎస్‌పీ (టెక్నికల్ సర్వీస్ ప్రొవైడర్) ద్వారా పర్యవేక్షణ జరుగనున్నది.

**142 ఏళ్లలో ఎంత మార్పు..!**

మహా కుంభమేళాను ఘనంగా నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7,500 కోట్లు ఖర్చుచేసి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు 40 కోట్ల మందికిపైగా వస్తారని అంచనా వేస్తోంది. 1882లో భారతదేశ జనాభా 22.5 కోట్లు. అప్పట్లోనే మాఘ అమావాస్య నాడు 8 లక్షల మంది పవిత్ర సంగమంలో స్నానమాచరించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ఈ ఏర్పాట్ల కోసం ఖర్చు చేసింది రూ 20,288 మాత్రమే. ఇప్పుడు ఏకంగా రూ.7,500 కోట్లతో ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం.

**అర్ధ కుంభ, పూర్ణ కుంభ, మహా కుంభమేళా మధ్య తేడా ఏమిటి?**

సనాతన ధర్మంలో కుంభమేళాకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కుంభమేళాకు దేశం నలుమూలల నుండి ప్రపంచం నలుమూలల నుండి ప్రజలు హాజరవుతారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాగ సాధువులు కూడా ఈ జాతరలో పాల్గొంటారు. కుంభమేళా నాలుగు పవిత్ర పుణ్యక్షేత్రాలైన ప్రయాగ్ రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్ లలో జరుగుతుంది.2025 లో ప్రయాగ్ రాజ్ లో మహాకుంభమేళా జరుగుతుంది. పూర్ణకుంభం, మహాకుంభమేళా. అర్ధ కుంభ, పూర్ణ కుంభ, మహాకుంభ మధ్య తేడా ఏంటో తెలుసుకుందాం.

**స్థానం ఎలా నిర్ణయించబడుతుంది?**

కుంభమేళా స్థానాన్ని సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి మకర రాశిలో బృహస్పతి వృషభ రాశిలో ఉన్నప్పుడు ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా జరుగుతుంది. అదే సమయంలో, సూర్యుడు మేష రాశిలో, బృహస్పతి కుంభరాశిలో ఉన్నప్పుడు హరిద్వార్ లో కుంభమేళా నిర్వహిస్తారు.సూర్యుడు సింహ రాశిలో, బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలో కుంభమేళా జరుగుతుంది. సూర్యుడు, బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు, సింహ రాశి లేదా కర్కాటకంలో ఉన్నప్పుడు కుంభమేళా జరుగుతుంది. నాసిక్ లో కుంభమేళా జరుగుతుంది.

**అర్ధ కుంభమేళా**

ప్రతి ఆరేళ్లకోసారి జరుగుతుంది.. అర్ధ కుంభమేళా ప్రయాగ్ రాజ్, హరిద్వార్ లలో మాత్రమే జరుగుతుంది.

**పూర్ణ కుంభమేళా**

12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభమేళాను నిర్వహిస్తారు. ప్రయాగ్ రాజ్ లోని సంగం ఒడ్డున నిర్వహిస్తారు.చివరిసారిగా 2013 లో ఇక్కడ పూర్ణ కుంభమేళా జరిగింది.

**మహా కుంభమేళా**

ప్రయాగ్ రాజ్ లో 12 పూర్ణ కుంభమేళా జరిగినప్పుడు దానికి మహాకుంభ్ అని పేరు పెట్టారు. మహా కుంభమేళా 12 పూర్ణ కుంభల్లో ఒకసారి జరుగుతుంది. మహా కుంభమేళా 144 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది.



# తైక్వాండో పోటీల్లో గాంధీజీ విద్యార్థుల ప్రభంజనం

## విజేతలను అభినందించిన ఎస్ఐ

**విశ్వంభర, చండూరు:** మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎండీ రేయాన్ బంగారు పతకం, ఎన్ మధుశ్రీ రజత పతకం, బి అనన్య కాంస్య పతకాలను సాధించి ఉత్తమ ప్రతిభను కనబర్చి తమ సత్తా చాటారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సుమారుగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు చండూర్ ఎస్సై నార్సింగ్ వెంకన్న గౌడ్ శాలువాలు కప్పి, మెడల్స్, సర్టిఫికేట్లను అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఇదే స్ఫూర్తితో విజయాలు సాధించి పాఠశాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం, శారీరక దృఢత్వం కోసం టైక్వాండో విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని, మా పాఠశాలలో విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వారిలో ఆత్మస్థైర్యం పెంచడానికి వివిధ వేదికలపై జరిగే కార్యక్రమాల్లో వారిని పంపడం జరుగుతుందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, గణేష్, కోచ్ రమేష్ తదితరులు పాల్గొని చిన్నారులను అభినందించి ఆశీర్వదించారు.

## సబ్ స్టేషన్ మంజూరుపై హర్షం



**విశ్వంభర, మేడిపల్లి:** భీమారం మండల కేంద్రంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేసిన సందర్భంగా మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమజ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు గ్రామస్థులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాలభిషేకం చేశారు. మండల కేంద్రంలో సబ్ స్టేషన్ మంజూరి అయిన సందర్భంగా మండల మరియు గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బక్కురి నరేష్, తాజా మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఉప సర్పచ్ బస్వర్జుల రాజు, మాజీ ఎంపీటీసీ,పల్లి అర్జున్, రాజాబోష్,అరె నర్సయ్య,గుండేటి సత్యనారాయణ, బొమ్మెన ప్రశాంత్, పల్లి భీమయ్య, చెక్కపల్లి శంకర్, పెద్దిరెడ్డి స్వామి సురుకంటి రాజారెడ్డి, దువ్వస గంగాధర్, గంట గంగరాజం, చుక్క తిరుపతి, కొత్తపెల్లి అజయ్, అడ్లగట్ట ప్రేమ్, సుమలత, మాజీ సర్పంచ్ బాలసాని లహరిక, గుగ్గిళ్ళ గంగాధర్, చెట్పెల్లి నాగరాజ్, అవ సాగర్, పుట్ట రాజేందర్, అవ్వ శంకర్, ఉత్కం శంకర్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, ఎండి రఫీ మరియు గ్రామ యువజన సంఘాల నాయకులు,మహిళా సంఘాల సభ్యులు రైతులు, కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజా గౌలిపుర నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొగ్గారపు దయానంద్ గుప్తా ఎమ్మెల్సీ, ఆత్మీయ అతిథి కాసన గట్టు రాజశేఖర్ గుప్తా, గంధ హనుమంతరావు గుప్తా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘం మాజీ అధ్యక్షులు గుగ్గిళ్ళ అశోక్ కుమార్ గుప్తా, సరాబు, విశ్వేశ్వరయ్య గుప్తా, సంఘ అధ్యక్షులు సరాబు సంతోష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అడ్మిన్ గుగ్గిళ్ళ సంతోష్ కుమార్, అదనపు ఉపాధ్యక్షులు చాలిక నాగరాజు, కార్యదర్శులు ముచ్చర్ల అశోక్ గుప్తా, పోలా జగన్నాథం, యాదగిరి, శ్రీకర్, మలక్ పేట అధ్యక్షులు నరేందర్ గుప్తా తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## పేకాట స్థావరంపై సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి



**విశ్వంభర, హైదరాబాద్:** ఉప్పుగూడ ప్రాంతం లోని ఓ నివాసం నందు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసుల బృందం పేకాట స్థావరంపై దాడి నిర్వహించి 12 మంది అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 56 వేల 700 రూపాయలు మరియు ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఛత్రినాక పోలీసులకు అప్పగించారు.

## మంత్రిని కలిసిన సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు

డా. యర్రమాద కృష్ణారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా. యర్రమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు వై.హేమలత దంపతులు నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నీ మినిస్టర్ క్వార్టర్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య నిపుణులు దైవజ్ఞ శర్మ , తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కోదుమూరి దయాకర్ రావు, సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షులు గుంటకండ్ల ముకుంద రెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భట్టి విక్రమార్కతో చర్చలు



**విశ్వంభర, హైదరాబాద్:** సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బట్టివిక్రమార్క తో జరిగిన చర్చల్లో, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మరియు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి పాల్గొన్నారు. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమ్మె సమయంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వంతో సమన్వయం కల్పించేందుకు ప్రొఫెసర్ కోదండరాం చేసిన కృషికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేఆర్

**విశ్వంభర, వర్ధన్నపేట:** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద గ్రామం నుంచి జగన్ తండా, చంద్రు తండా లను కలుపుతూ పర్వతగిరి వరకు ఆర్ %ఙ% బి నిధులు సుమారు 4.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోతున్న బి.టీ రోడ్డు కు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచమని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను,డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందాన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్నీ గుర్తు చేశారు.. అలాగే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం



మన ప్రజా ప్రభుత్వం రైతులకు ఈ నెల జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకం క్రింద ఏడాదికి 12000 ఇవ్వనున్న ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం దయచేసి ప్రజలందరూ బీఆర్ఎస్ బీజేపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, కొందుర్గు:** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో సోమవారం బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి గుండేటి శివారెడ్డి ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి బీజేపీ నాయకులు రైతులు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుండేటి శివారెడ్డి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రైతులకు పెట్టుబడి సాయంగా ప్రధానమంత్రి కిసాన్ సన్మాన యోజన నిధిని 6,000 రూపాయల నుండి పదివేల రూపాయలకు పెంచడం, ఫసల్ బీమా యోజనకు అధిక నిధులు కేటాయించడం డీఏపీ ధర రూ.1350లు చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, వ్యవసాయదారులను ఆదుకునేది కేంద్ర ప్రభుత్వమేనని, రైతులకు ఎలా మేలు చేయాలో నరేంద్ర మోడీకి మాత్రమే తెలుసునని అన్నారు. మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టుబడి సాయంగా ప్రతి సంవత్సరం ఎకరాకు 15 వేల రూపాయలు ఇస్తామని మాట ఇచ్చి ఇప్పుడు రూ.12,000లు మాత్రమే ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ పార్టీ తను మోసకారినని మరోసారి రుజువు చేసిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజల్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొమరబండ శ్రీశైలం, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మయ్య గౌడ్, చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, బీజేవైఎం నాయకులు బోయ అశోక్, సీనియర్ నాయకులు సున్నాల అంజయ్య, కారుకొండ సుధాకర్, చంద్రశేఖర్, పులిందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, లక్ష్మయ్య, ఎర్ర రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం కెనాల్ పనులు అడ్డుకున్న రైతులు

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లో నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ పనులను అడ్డుకున్నారు ఎలికేశ్వరం గ్రామ రైతులు. తమకు సమాచారం ఇవ్వకుండా సాగు చేసుకున్నటువంటి భూముల్లో అన్యాయంగా యంత్రాల ద్వారా కెనాల్ పనులను చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పోలీసులను పెట్టి అక్రమంగా భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేసిన సర్వే కాకుండా ఇప్పుడు కొత్తగా సర్వే పేరుతో దళితుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లో మా భూములు ఇవ్వబోమని రైతులు అన్నారు. నష్టపరిహారం చెల్లించకుండా మా భూములు లాక్కుంటే చావడానికి అయినా సిద్ధంగా ఉన్నామని, ఎట్టి పరిస్థితుల్లో మా సాగుభూములను ఇవ్వబోమని పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్నారు. సాగు చేసుకుంటున్నటువంటి భూమిని లాక్కుంటే మా జీవనోపాధిని కోల్పోతామని ప్రస్తుత మార్కెట్ విలువ



కంటే రెండింతలు నష్టపరిహారం చెల్లించిన తరువాతనే పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు.



వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనుటకు సోమవారం హైద్రాబాద్ నుండి చాపర్ లో జిల్లా కు విచ్చేసిన ఉమ్మడి వరంగల్ ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రులకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హెలిప్యాడ్ వద్ద హన్మకొండ లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ లకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికిన గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి.
– విశ్వంభర, వరంగల్

## బీసీ ఉద్యమకారుడు పంతకాని శ్రీను కు దక్కిన గౌరవం

### మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డు అందజేసిన నల్ల రాధాకృష్ణ




**విశ్వంభర, మహదేవపూర్:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బీసీ ఉద్యమకారుడు పంతకాని శ్రీనివాస్ కు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డును అందజేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం హైదరాబాదులో నీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 8వ జాతీయ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బహుజన సాహిత్య అకాడమీ ప్రతినిధుల సమక్షంలో బహుజన సాహిత్య అకాడమీ సెలక్షన్ నేషనల్ కమిటీ ఛైర్మన్ నల్ల రాధాకృష్ణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ కు మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డును అందజేశారు. అనంతరం బీ ఎస్ ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ పంతకానీ శ్రీనివాస్ బీసీ ఉద్యమంలో కీలకంగా పని చేస్తూ బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని, కృషిని గుర్తించి మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీత పంతకానీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి బీసీల ఐక్యతకు, బీసీల రాజ్యాధికారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులతోపాటు బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎం గౌతమ్, స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ తాటిపల్లి ఈశ్వర్, ఆంధ్ర ప్రదేశ్ బీ ఎస్ ఏ అధ్యక్షుడు మట్ట ప్రభాస్ కుమార్, ప్రతినిధులు బాలయోగి, తాటికొండ ఐలయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**విశ్వంభర, మహబూబాబాద్:** నేడు మహబూబాద్ మండల కేంద్రంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ ఐదు లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మహబూబాద్ ఎమ్మెల్యే



డా. భూక్యా మురళీ నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమ్మగూడెం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని అంతేకాకుండా మీరు అందరు కలసి కట్టుగా ఉండి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలి అంటే మన ప్రజా ప్రభుత్వం కి అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీ తో గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి కి తోడ్పడాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటీ రాంరెడ్డి,జిల్లా యూత్ నాయకులు దుపటి వినయ్,గ్రామస్తులు మంగిలాల్ ,శ్రీను,నెహ్రూ,సేవ్య,వెంకన్న,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భళా..సింగర్ నరేష్

### వండర్ జీనియస్ ఆఫ్ రికార్డ్ లో చోటు

**విశ్వంభర, నెల్లికుదురు:** వండర్ జీనియస్ ఆఫ్ రికార్డ్ బుక్ లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వావిలాల గ్రామానికి చెందిన సింగర్ బాసంపెల్లి నరేష్ కు చోటు దక్కింది. ఖమ్మం జిల్లా



కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'జయహో జానపదం పల్లె పాట' కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది పాల్గొన్నారు. 6 గంటల పాటు నిరాఘాటంగా సాగిన కార్యక్రమంలో నరేష్ అద్భుత గానం చేసి సభికులచే ఔరా అనిపించుకున్నాడు. దీంతో ఆయనను వండర్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేశారు. సంస్థ వ్యవస్థాపక అధినేత బింగి నరేందర్ గౌడ్ చేతుల మీదుగా నరేష్ ను సన్మానించి రికార్డ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత నరేష్ మాట్లాడుతూ.. తాను చిన్ననాటి నుంచి కష్టపడి పాటే ప్రాణంగా భావిస్తూ పలు ప్రదర్శనల్లో పాల్గొని ఎన్నో అవార్డులు పొందానని, వండర్ జీనియస్ ఆఫ్ రికార్డులో చోటు తగ్గడం సంతోషంగా ఉందన్నారు. కాగా ఆయన స్వగ్రామం వావిలాలతోపాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో ఓటర్ల జాబితా

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 3,35,27,925 ఉన్నారు.ఇందులో పురుష ఓటర్లు 1,66,41,489 ఉమ్మడగా.. మహిళా ఓటర్లు 1,68,67,735, థర్డ్ జెండర్ ఓటర్లు 2,829 ఉన్నారు. – విశ్వంభర, హైదరాబాద్

# ప్రజావాణికి 87 దరఖాస్తులు

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 87 వినతులు స్వీకరించడం జరిగిందని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం చాలా ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. మన మహోత్సవం 2025 కార్యక్రమానికి గాను జిల్లా వనమోత్సవ సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాగల వర్షాకాలంలో శాఖల వారీగా ప్రభుత్వం నిర్దేశిత ప్రణాళికలు ఇచ్చిందని 2025-26 సం? గాను 59 లక్షలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని దీనిలో ముఖ్యంగా డీఆర్డీఏ 29 లక్షలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ 15 లక్షల 50 వేలు, వ్యవసాయ శాఖకు నాలుగు లక్షలు, ఇరిగేషన్ శాఖకు 2,50,000 మొత్తం 22 శాఖలకు గాను 59 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని శాఖల వారీగా వారి లక్ష్యాలను సాధించడానికి చర్యలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇచ్చిన లక్షణాల ప్రకారం మొక్కలు నాటుట కొరకు శాఖల వారీగా ప్రాంతాలను స్థలాలను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. గతంలో నాటిన మొక్కలు సంరక్షించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది తప్ప హెల్మెట్, సీటు బెల్టును పెట్టుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు పాటించాలని కలెక్టర్ కోరారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈనెల 9న నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీకి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. సోమవారం నుండి కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు తమ వాహనంలో ప్రయాణించినప్పుడు తప్పక సీటు బెల్టు వినియోగించాలని అలాగే వాహనంలో వెనుక కూర్చున్న వారు కూడా సీటు బెల్టు ధరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు , డీఎఫ్ సతీష్ కుమార్, డీఆర్డీఏ పీడీ వివి అప్పారావు, డీ డబ్ల్యు ఓ నరసింహారావు, జిల్లా యస్ సీ అభివృద్ధి అధికారి బిఎస్ లత. సీపీఓ ఎల్ కిషన్, డీఎం అండ్ హెచ్ ఓ కోటాచలం, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి ,డీటీడీఓ శంకర్, డీఇఓ అశోక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, పశుసంవర్ధక అధికారి డి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర శర్మ ,జిల్లా పౌరసరఫరాల అధికారి డి రాజేశ్వర్ , డీపీఓ నారాయణరెడ్డి, పీ ఆర్ ఈ ఈ కే మాధవి, డీ డీ ఐ ఈ ఓ భాను నాయక్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల



**విశ్వంభర, సూర్యాపేట:** తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇమాంపేట నందు ఆరవ తరగతి 100 సీట్లకు మరియు ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు 06-01-2025 నుండి 28-02-2025 వరకు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీసు రమేశ్ తెలిపారు. ఆన్లైన్లో అప్లై చేసుకున్న విద్యార్థులు 03-04-2025 నుండి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చుని మరియు ఎంట్రెన్స్ ఎగ్జామ్ 13-04-2025 న నిర్వహించబడును అని తెలియజేశారు. అడ్మిషన్ కొరకు ఆన్లైన్లో అప్లై చేయుటకు ఓసీ విద్యార్థులు 200 రూపాయలు మరియు బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీ.హెచ్.సీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు 125 చెల్లించి %ట్రీజూ7/వశ్రీఖఅస్త్రుఖుఎం.స్త్రశీజ.ఖఅ% అప్లై చేసుకోవలెను. ఇమాంపేట ఆదర్శ పాఠశాల పక్కా భవనం మరియు సువిశాల ప్రాంగణము, ఆహ్లాదకరమైన ఆట స్థలము, మధ్యాహ్న భోజనం, ఉచిత స్కూల్ యూనిఫార్మ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత రాత పుస్తకాలు, మినరల్ వాటర్ సౌకర్యం, ప్రయోగశాలలు కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, డిజిటల్ క్లాసులతో పాటు వృత్తి విద్యా కోర్సులు (ఐటీ/ఐటీఈఎస్ మరియు బ్యూటీ అండ్ వెల్నెస్) బోధించబడుతుంది. సూర్యాపేట నుండి ఆదర్శ పాఠశాల వరకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదు. క్రమశిక్షణను దేశభక్తిని పెంపొందించే ఎన్సీసీ అండ్ ఎన్ఎస్ఎస్ సౌకర్యాలతో పాటు, అంకితభావం, అనుభవంతో కూడిన అధ్యాపక బృందం కలరు. ఇంగ్లీష్ మీడియం లో బోధనా అనుభవం కలిగిన ఉత్తమ ఉపాధ్యాయ బృందంచే నిత్యం ఆంగ్ల భాష నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ మరియు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపరచుటకై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మిగిలిన వివరాలకు ఫోన్ నంబర్: 9533247792, 9959265009 లేదా పాఠశాలలో సంప్రదించగలరు.

## సావిత్రిబాయి పూలే అవార్డు పొందిన మనం స్వచ్ఛంద సంస్థ



**విశ్వంభర, నార్కట్ పల్లి:** గత కొన్ని నెలలుగా నిరాటకంగా ప్రతిరోజు దాదాపు 100 మందికి పైగా నిరుపేదలకు అభాగ్యులకు దాతల సహాయంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్న నార్కట్ పల్లి పట్టణానికి చెందిన మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ దైద నాగరాజుకు సూర్యాపేటకు చెందిన హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ, నాగరాజు సేవలను గుర్తించి సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ నేషనల్ అవార్డును హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాణ సభలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, పతాని రామకృష్ణ గౌడ్, తెలంగాణ ఫిలిం చాంబర్ అధ్యక్షులు చేతుల మీదుగా అందించడం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, హోప్ స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకులు దైద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం**



**విశ్వంభర, సూర్యాపేట:** రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై సాయి రామ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం సూర్యాపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను సరిగా పాటించకపోవడం వల్లే తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమని ఆదశలోనే విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఉన్నత స్థాయిలకు ఎదిగినప్పుడే అందరూ గౌరవిస్తారని ఆ దిసాగా అడుగులు వేయాలని సూచించారు. తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మరియు అదేవిధంగా వాహన చోదుకులు డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్లలో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు అధికం కారణంగా ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవి. విద్య సాగర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చంప్లా, పి.ఈ.టి రేహమతుల్ల, హెల్త్ సూపర్వైజర్ జానీ పాషా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశం



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ పై ఆ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రివర్యులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ శ్రీమతి కడియం కావ్య ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, హనుమండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి లతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కలెక్టర్ లు పి.ప్రావీణ్య, సత్యశారద అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం బాగున్నప్పుడు రోబోటిక్ సర్జరీ చేయించుకోవాలి

**- డాక్టర్ సునీల్ దాచేపల్లి**




**విశ్వంభర, సూర్యాపేట:** మోకాళ్ళ అరుగుదల ఒక వయసు వచ్చాక ప్రతి ఒక్కరిలో ఉంటుందని దాన్ని అలా వదిలేస్తే భవిష్యత్తులో బాత్రూంకు కూడా నడవడం కష్టతరం అవుతుందని యశోద ఆసుపత్రి సోమాజీగూడ సీనియర్ అర్థోపెడిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ కీ హోల్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాజు బాంకెట్ హాల్లో ఏర్పాటు చేసిన మోకాళ్ళ శాస్త్ర చికిత్సలో భాగంగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ అత్యాధునిక పద్ధతిపై అవగాహన కల్పించి మాట్లాడారు. మోకాళ్ళ నొప్పులను నివారించేందుకు మొత్తం నాలుగు స్టేజీలు ఉంటుండగా మొదటి రెండు స్టేజీల వరకు ఇంజక్షన్ తీసుకోవచ్చని కానీ ఆఖరి రెండు స్టేజీల్లో శస్త్ర చికిత్స మాత్రమే పని చేస్తుందన్నారు. చాలామంది శస్త్ర చికిత్సకు భయపడి ఇంజక్షన్ మాత్రమే చేసుకొని మోసపోతున్నారని ప్రతి ఒక్కరు తమ మోకాళ్ళ అరుగుదలను కనుగొని శస్త్ర చికిత్స చేయించుకోవడం మంచిదన్నారు. చేతులతో సర్జరీలు చేస్తే కొన్ని సార్లు దానిలో అంగిల్స్ తేడా రావచ్చని కానీ రోబోతో చేస్తే ఖచ్చితంగా సరైన కటింగ్ విధానం బాగుంటుందని ప్రిపరేషన్ సరిగా ఉంటుందన్నారు. రోబోటిక్ సర్జరీతో జీవిత కాలంలో మరో శాస్త్ర చికిత్స చేయకుండా ఉపయోగపడుతుందన్నారు. నొప్పి తక్కువ, కటింగ్ చిన్నవిగా ఉండడం తో త్వరగా కోలుకుంటారని అన్నారు. రోబోటిక్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జరీతో చాలా ప్రయోజనాలున్నాయని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం రోబోటిక సర్జరీ చేయించుకున్న సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మంత్రమూర్తి శంకరమూర్తి, సంజీవరెడ్డిలు తమ అనుభావాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ యు.పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ టి.రామ్ ప్రకాష్ లు ఉన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు




**విశ్వంభర, ఏటూరు నాగారం:** రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ఎవరూ కూడా నిబంధనలు అతిక్రమించి అతివేగంగా ప్రమాదకరమైన డ్రైవింగ్ చేస్తూ మద్యం సేవించి రాంగ్ రూట్లో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీష్, ఏటూరు నాగారం ఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు సోమవారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, టాటా ఏసీ డ్రైవర్లు, డీసీఎం డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ. రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించకుండా మాదకద్రవ్యాలకు, మద్యం కు బానిసై ప్రమాదకరంగా అతివేగంగా రాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదంలో చాలామంది మృత్యువాత పడుతున్నట్లు గుర్తు చేశారు. భద్రత నియమాలు పాటించకుండా రోడ్డు ప్రమాదాలకు గురి అయితే తమ కుటుంబాలు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని ఆలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు హెలిమెట్ ధరించడం ముఖ్యమని సూచించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించకుండా ఎవరైనా వివరించినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతతో పేదరిక నిర్మూలన





**విశ్వంభర, భూపాలపల్లి:** సంక్షేమ పథకాల పట్ల అవగాహన కలిగి వున్నప్పుడే పేదరిక నిర్ములన సాధ్యం అవుతుందని అలాగే ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణ కూడా పేదరికాన్ని పోగొడుతుందని భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీ ఆర్ డీ ఏ) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పేదరిక నిర్ములపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుభాష్ కాలనీలోని మండల సమాఖ్య సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి జడ్జి అతిధిగా హాజరయ్యారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీ ఆర్ డీ ఏ) ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి పథకాలు అమలు చేయబడుతున్నాయని, మహిళల ఆర్థిక స్వేచ్ఛ కోసం కూడా పథకాలు ఉన్నాయని జడ్జి అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక, డీ ఆర్ డీ ఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోవిందరావు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు నారాయణ, సోమయ్య, ఏపీఎం రతన్ సింగ్, సీసీ లు విజయలక్ష్మి, సంతోష్, అమరేందర్, మండల్ సమాఖ్య మరియు గ్రామా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణను కించపరిచేలా సీఎం మాట్లాడడం సిగ్గుచేటు

**మాజీ ఛైర్మన్ దేవి ప్రసాద్ రావు**

**విశ్వంభర, హైదరాబాద్:** వీరోచిత పోరాటాలతో, విద్యార్థుల, యువకుల అసమాన త్యాగాలతో, సబ్బండ వర్గాల పోరాట పటిమతో, కేసీఆర్ నాయకత్వంలో దేశ రాజకీయాలను శాసించి, ఒప్పించి, తెచ్చుకున్న తెలంగాణ ను కించపరిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు అని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవి ప్రసాద్ రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే ఉద్యోగుల పరిస్థితి బాగుండేదని అనడం తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేళ్ల కాలంలో రెండు సార్లు పీ ఆర్ సీ 73 శాతం (43 ప్లస్ 30) ఇచ్చి దేశం లోనే అగ్రభాగాన నిలబెట్టిన చరిత్ర తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ ప్రభుత్వం అని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలి అని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టో లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే పెండింగ్ లో ఉన్న డీఏ లను విడుదల చేస్తామని, ఆరునెలలలో పీ ఆర్ సీ అమలు చేస్తామని చెప్పి మోసం చేసింది కాంగ్రెస్ కాదా? 317 జీ ఓ ను సవరించి న్యాయం చేస్తామని చెప్పి ఇప్పటివరకు చేయకుండా మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్య ఛాయి తాగే సమయం చాలు పరిష్కారానికి అని చెప్పి, ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రయత్నం చేయండి అని గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను మోసం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? ఆశా వర్కర్లకు, అంగన్వాడీ టీచర్లకు, ఐకేపీ ఉద్యోగులకు, పంచాయత్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచుతామని, రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని అనడం విడ్డూరం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యోగుల పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉందనే విషయం ఏ ఉద్యోగిని అడిగినా తెలుస్తుంది. ఉద్యోగుల పరిస్థితి కాంగ్రెస్ పాలన లో దిగజారింది ఉమ్మడి రాష్ట్రం అయినా తెలంగాణ రాష్ట్రం లో అయినా అనే మాట వాస్తవం, ఉద్యోగుల వేతనాలకు పెన్షన్లకు నెలకు 6,500 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది అని అబద్ధాలు చెప్పి ఇవ్వలిసిన డీ ఏ, పీఆర్సీ ఎగ్గొట్టడానికే, ఉద్యోగుల పై పెడుతున్న నెల ఖర్చు 4,300 కోట్లు రూపాయలు మాత్రమే, రిటైర్ మెంట్ అయిన ఉద్యోగులకు ఇవ్వలిసినా ప్రయోజనాలు ఇవ్వకుండా వేధిస్తున్నది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాదా, ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాలి అని అన్నారు.

## పంప్ హౌస్‌లో పంపింగ్ మ్యానుఫోల్డ్ గ్యాస్ కిట్ ఫెయిల్యూర్



**విశ్వంభర, సూర్యాపేట:** అవంతిపురం పంప్ హౌస్ లో పంపింగ్ మ్యానుఫోల్డ్ గ్యాస్ కిట్ ఫెయిల్యూర్ అయ్యిందని సూర్యాపేట మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) తెలిపారు. ఇట్టి ఫెయిల్యూర్ మరమ్మత్తులు పనులు చేపట్టడం జరుగుచున్నది. కావున, 95 ఎంఎల్డీ ఇమాంపేట నీటి శుద్ధి కేంద్రం పరిధిలోని 2 మున్సిపాలిటీలు సూర్యాపేట మరియు కోదాడ, మండలాలు అనగా చిలుకూరు (19), కోదాడ(24), అనంతగిరి(24), మునగాల(32), నడిగూడెం(17), పెన్ పహాడ్(52) మరియు సూర్యాపేట పరిధిలోని 15 గ్రామీణ ఆవాసాలు లాల్య తండా, ఇమాంపేట, రూప్లా తండా, కేటీ అన్నారం, జంగలవారి గూడెం కాసరాబాదు, వెదురువానిగూడెం, జాటోత్ తండా, కేసారం, రాముల తండా, మిట్ట గూడెం, ముత్యాలమ్మ గూడెం, టి కే పహాడ్, బిల్య తండా, రతన్ బోజ్య తండా, 4 విలీన ఆవాసాలు దాసాయి గూడెం, దున్నవారిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, కుసుమవారి గూడెం లకు మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా నిలిచిపోయింది. తిరిగి మరల 07 జనవరి 2025 న సాయంత్రం 6:30 గంటల నుండి పునరుద్ధరించబడును. కావున ఆయా గ్రామాల ప్రజలకు తెలియపరచనైనదని ఈఈ అన్నారు.

## పీఆర్టీయూ టీఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, బహదూర్ పుర:** బహదూర్ పుర మండలంలో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ ఈవో పొమియా నాయక్, ముక్తదీర్ మండల పీఆర్టీయూ టీఎస్ ప్రెసిడెంట్ మేహారాజ్ సుల్తానా, జనరల్ సెక్రెటరీ అజార్ జహ, ఉపాధ్యక్షురాలు ఉజ్మ సుల్తానా, ఆర్గనైజింగ్ సెక్రటరీ బ మునీరా బాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 36 వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధత అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన 36 దరఖాస్తులను పరిష్కరానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించి, అట్టి సమాచారం ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరంపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి



**విశ్వంభర. మహేశ్వరం, తుక్కుగూడ:** రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. చరిత్రలో ఎన్నాడూ లేని విధంగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ఒక్క మహేశ్వరం నియోజకవర్గానికే రూ.153 కోట్లకు పైగా నిధులు కేటాయించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖల వారికి పంపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సోమవారం వివిధ సమస్యలపై ఈ క్రింది విధంగా కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. గూడూరు మండలం, చిన్నఎల్లపురం గ్రామంకు చెందిన కొల్లూరి, మల్లయ్య, తుమ్మల మకయ్య లు గతంలో ప్రభుత్వం నుండి మంజూరు అయి ఇల్లు నిర్మించుకున్నాను అందుకు సంబంధించిన బిల్లు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మండలం, వెంకటాపురం గ్రామంకు చెందిన మందుల సుగుణమ్మ, తనకు ఇందిరమ్మ ఇల్లు, ఉచిత గ్యాస్ కలెక్షన్ మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన నీలం కృష్ణవేణి, దాసరి సోమలక్ష్మి, ఎర్రమ్మ, కమటం పద్మ, తదితరులు తమకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని దరకస్తులు తీసుకోవాలి కోరారు. ఇలా మొత్తం 99 ధరకాస్తు వచ్చాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ పీడీ మధుసూదన రాజు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, సీపీవో సుబ్బారావు, డీహెచ్ఓ మరియన్న, గ్రాండ్ వాటర్ అధికారి వేముల సురేష్, డీఏఓ విజయ నిర్మల, అన్నీ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు మహబూబాబాద్ జిల్లా విద్యార్థులు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల పోలేపల్లి సెజ్ లో ఆరో తారీకు నుంచి తొమ్మిదవ తారీకు వరకు జరగబోయే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొనుటకు జిల్లాస్థాయిలో విజేతలైన 8 ఇన్స్పైర్ ప్రాజెక్ట్స్ సంబంధించిన విద్యార్థులు, రాష్ట్ర బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలైన 13 ఎగ్జిబిట్ లకు సంబంధించిన విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు మొత్తం 37 మంది రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొనుటకు సోమవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణం నుండి బయలుదేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మీ మీ ఎగ్జిబిట్ ల ను చక్కగా ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో కూడా విజేతలు కావాలని తెలియజేస్తూ జెండా ఊపి విద్యార్థుల బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలైన మీరందరూ కూడా రాష్ట్రస్థాయిలో కూడా మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఆర్.ఓ రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ ఆఫీసర్ బి.అప్పారావు, హెడ్మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరాం, ప్రధానోపాధ్యాయులు సంక బద్రి నారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రేమ్ నాయక్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు



**విశ్వంభర, కల్వకుర్తి:** అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ఉద్యోగ సంఘ ఎన్నికలు ఆదివారం జరగడంతో కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ప్రేమ్ కుమార్ నాయక్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా భారీ మెజార్టీతో విజయం సాధించినందుకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన ఛాంబర్ లో కల్వకుర్తి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవి గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మీ నరసింహులు శాలువా తో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి సచివాలయంలో ఎన్నికల నిర్వహించడం జరిగిందని నా మీద నమ్మకంతో గెలిపించినందుకు ఉద్యోగుల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని అవకాశం ఇచ్చిన ఉద్యోగ సంఘాలకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## డిప్యూటీ కమిషన్ ని సత్కరించిన చిలుక ఉపేందర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ వ్యాయామం (జిమ్), గ్రీన్ హిల్స్ కాలనీ వ్యాయామం (ఓపెన్ జిమ్), యాదవ్ నగర్ కాలనీ వ్యాయామం (ఓపెన్ జిమ్), జనప్రియ కాలనీ వ్యాయామం (ఓపెన్ జిమ్) పరికరాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో డిప్యూటీ కమిషనర్ సుజాతని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల విడుదలకు కృషి చేసిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి లకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్, మధుసూదన్ రావు, లింగ స్వామి గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, తలాటి రమేష్, యాదవ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా,శివ, ఎల్లయ్య,రాజు నాయక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**విశ్వంభర, హనుమకొండ:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ - గెజిటెడ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరు మంచిగా కష్టపడి పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలని తెలియజేశారు. అలాగే అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి, రెవెన్యూ డివిజనల్ అధికారి సత్యపాల్ రెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ విశ్వప్రసాద్ లకు కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యా నరసింహ నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్యా కస్నా నాయక్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య గౌరవాధ్యక్షులు పొట్లపెల్లి రవీందర్ రావు, కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సాంబరాజు, ఎర్ర మురళి, భచ్చలపూరి రమేష్, గుంటుక ఐలయ్య, రాఘవులు రాజేందర్ మరియు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆందోళన




**విశ్వంభర మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గోడిషాల వెంకన్న మాట్లాడుతూ సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ఇంటింటికి వెళ్లి సర్వే చేశామని, గ్రామాల్లో అర్హులైన వారికి రేషన్ కార్డులు లేవని, పెన్షన్లు , గ్యాస్ సబ్సిడీలు, ఫ్రీ కరెంట్ జీరో బిల్లులు రావడంలేదని, సాగు చేసుకుంటున్నా పోడు భూములకు ఎస్సీలు బీసీలు హక్కు పత్రాలు రాలేదని, కొందరికి రుణమాఫీ కూడా కాలేదని, కల్వల గ్రామంలో సర్వే నెంబరు 171, 172 ,173, 260 లలో ఆరు ఎకరాలు భూమి ప్రభుత్వం భూమి కొనుగోలు చేసికొనుగోలు చేసి ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు పట్టాలు మంజూరు చేసింది. కానీ 25 సంవత్సరాలు గడిచిపోయిన నేటికీ పట్టాలు ఇచ్చి స్థలాలు కేటాయించలేదని సమస్యను పరిష్కరించి అర్హులైన వారికి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా భూమిలేని పేదలందరికీ కూలీ భరోసా రూ. 12,000 లు ఇవ్వాలని, రైతు భరోసా ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పదిహేను వేలు ఇవ్వాలని, ఎన్నికల హామీలు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని. పాపారావు, మండల కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు చాగంటి కిషన్, నీరుటి. జలంధర్, కావటి నరసయ్య, అల్పుగొండ సావిత్ర, పొన్నాల జ్యోతి, శాఖ కార్యదర్శిలు, ముద్రకో, శ్రీను, ముద్రకోల. సారయ్య, మల్లెల. సుగుణమ్మ, నాంపల్లి నాగమ్మ, జిడ్డి వెంకటమ్మ, సయ్యద్ మున్ని, ఎస్ డి. ఇమ్రాన్, పులిగుజ్జు సౌందర్య, పొడిశెట్టి వెంకటలక్ష్మి, బయ్యలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీ వసూళ్ల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


- వేధింపులకు గురై మృత్యువాత పడుతున్న అమాయక ప్రజలు
- ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** అమాయక ప్రజలకు డబ్బు ఆశజూపి అధిక వడ్డీలకు ఇస్తూ వారి ప్రాణాలకు పోవడానికి కారణం అవుతున్న వడ్డీ వ్యాపారస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కరకగూడెం మండల కేంద్రానికి చెందిన దోమల ప్రణయ్ అనే వ్యక్తికి ఆంధ్రాకు చెందిన ఓ వ్యాపారస్తుడు అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి ఆయనను మానసికంగా ఇబ్బందులకు గురి చేశాడని తెలిపారు. దీంతో ఆయన వేధింపులు తాళలేక మృతి చెందాడని అన్నారు. అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్న వారిని పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వడ్డీలకు డబ్బులు ఇస్తున్న వ్యక్తిని పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ అతను తన డ్యూటీ చేస్తున్నాడని ఆరోపించారు. తక్షణమే ఆయన్ని విధులనుంచి తొలగించాలని కోరారు. అదేవిధంగా డబ్బులు ఇస్తున్న వారికి కొందరు పోలీసు అధికారులు కూడా సహకరిస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. తక్షణమే ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. తమ పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉండి అన్ని రకాలుగా చేయూతనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని ఆపండి

**డిమాండ్ చేసిన రైతులు**



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా సన్నకారు, చిన్నకారు రైతుల భూములు గ్రీన్ఫీల్డ్ రోడ్డు నిర్మాణం వల్ల భూములను కోల్పోవడం జరుగుతుందని రైతులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. తమ భూములను బలవంతంగా తీసుకుని నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ ఆకుతోటపల్లి, సాకిబండతాండ, మాలేపల్లి గ్రామాలకు చెందిన బాధిత రైతులు కలెక్టర్,ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయంలో మెమరండం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి పచ్చని పంటపొలాలను రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుంటుందని, ఈ వెంటనే నిలిపివేయాలి రైతులు తెలిపారు. కాని అధికారులు పట్టించుకోకుండా ల్యాండ్ సర్వే వెంటనే నిలిపివేయాలని రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల భూమిలో నుండి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వెయ్యనీయమని రైతులు కరాకండిగా చెప్పడంతో అధికారులను ఆగాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మణిపాల్, బోడ్య, చందర్,పాండు, రవిరాథోడ్, విజేందర్, రాజా, వినోద్, బాలు గోపి,శివరాం, కుమార్, నాయకులు పాల్గొనడం జరిగింది.

## విజయవంతమైన వైద్య ఆరోగ్య శిబిరం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామపంచాయతీలో సోమవారం డీసీసీబీ డైరెక్టర్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్, గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి లతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు ఉప్పల అఖిల్ బృందం పరీక్షలు చేసి అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 420 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గణేష్, మాదారం బీ ఆర్ ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణయ్య, జలీల్, మహేందర్ గౌడ్, కిషన్, జంగయ్య, చెన్నయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న దగా పడ్డ కళాకారుల పాటల పల్లకి



**విశ్వంభర, హనుమకొండ:** గత ప్రభుత్వంలో దగాపడ్డ కళాకారులు ఆధ్వర్యంలో పాటల పల్లకి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హనుమకొండ లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో జరగబోవు సభకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎట్లున్నవే నా పల్లె ఎట్లున్నవే నా తల్లి ప్రముఖ రచయిత నేర్నాల కిషోర్ అన్న. టీపీసీసీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, మూడు రంగుల జెండా బట్టి ఒక్కడై కదిలి వస్తున్నాడేమో మన రేవంతన్న రచయిత సింగర్ నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి, బుల్లెట్ వెంకన్న, గడ్డం సుధాకర్ అన్న, పాలటి రాజన్న, వరంగల్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బిర్రు సురేందర్, ఆధ్వర్యంలో కొనసాగుతుంది. కవులు కళాకారులు మేధావులు అందరు కూడా ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీ తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిర్రు సురేందర్ కోరారు.

## మృతుడి కుటుంబానికి ఉప్పల ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం మాదాయ పల్లి గ్రామానికి చెందిన కొత్తూరు చంద్రయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మూడువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ హైమావతి రామస్వామి, సుధాకర్, యాదయ్య, పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**విశ్వంభర, ఇనుగుర్తి:** మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలంలోని వివిధ గ్రామాల కు చెందిన 17 మంది అనారోగ్య బాధితులకు రూ.5,23,500 విలువగల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను మానుకోట క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు సీఎంఆర్ఎఫ్ చేయూతగా సహకరిస్తుందన్నారు. కాగా మండలంలోని చిన్ననాగారం ఒకరికి, చిన్న ముప్పారం ముగ్గురికి, కోమటిపల్లి ఐదుగురికి, ఇనుగుర్తి 8 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ బైరు అశోక్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము, దాసరి ప్రకాష్, కాలేరు శివాజీ, జగన్, మామిడి జనార్ధన్, మల్లేశం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పి.ఆర్.టి.యు క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, మలక్ పేట్:** పి.ఆర్.టి.యు టీఎస్ రాష్ట్ర, జిల్లా, చార్మినార్ మండల క్యాలెండర్ ఆవిష్కరణ ను డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయంలో చార్మినార్ మండల డిప్యూటీ ఈవో చార్మినార్ సుజాత, చార్మినార్ మండల్ డిప్యూటీ ఐఓఎస్ నర్స రాజు సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, సైదాబాద్ మండల అధ్యక్షుడు అంజనేశ్వర్ రావు, చార్మినార్ మండల అధ్యక్షురాలు ఇష్రత్ సుల్తానా, వైస్ ప్రెసిడెంట్ మాజిద్ ఇక్బాల్, సెక్రటరీ బాలకృష్ణ, మహిళా కన్వీనర్ అష్రఫ్ సుల్తానా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోఫియా నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్.. అన్నదానం



**విశ్వంభర, కడ్తాల్:** తెలంగాణ రాష్ట్రంలో లయన్స్ క్లబ్ మల్టిపుల్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వీల్స్ అండ్ మిల్స్ కార్యక్రమాన్ని కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో లయన్స్ పెద్దలు, మాజీ గవర్నర్ డాక్టర్ జి. చెన్న కిషన్ రెడ్డి మామ జంబుల రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా ఎర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ రాంరెడ్డి ఐ ఆసుపత్రి ఛైర్మన్ డా. వి. దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఏరియా లీడర్ జి. చెన్న కిషన్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి దో నాదుల మహేష్, లయన్స్ క్లబ్ సభ్యులు చేగూరి వెంకటేష్, తాళ్ల అంజయ్య, గోవర్ధన్ రెడ్డి, పిప్పళ్ళ వెంకటేష్, గూదే రాజేందర్, బిచ్య నాయక్ లక్ష్మయ్య క్లబ్ పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి

- చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చెపిస్తే క్రిమినల్ కేసులు
- బాలకార్మికులు కనిపిస్తే సమాచారం అందించండి

**విశ్వంభర, భూపాలపల్లి:** బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జయశంకర్ భూపాలపల్లి ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ - %శ×% ను ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ వివిధ డిపార్ట్మెంట్ లకు చెందిన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బాల కార్మికుల విముక్తి కోసం ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ -%శ×% లో పాలుపంచుకొంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అన్నారు. క్షణికావేషంలో కొందరు పిల్లలు తొందరపాటులో చిన్న చిన్న విషయాలకే తల్లి దండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని,ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని, అలాంటి



వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తప్పిపోయిన పిల్లలను వెతికి 'దర్పణ్' అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచి తిరిగి తల్లి దండ్రుల వద్దకు చేర్చి వారి శోకాన్ని తీర్చాలన్నారు. బిక్షాటన చేస్తున్న వారి గురించి, బాలకార్మికుల గురించి ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ కు చెందిన 1098, 112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. భూపాలపల్లి, కాటారం సబ్ డివిజన్ స్థాయిలో ఒక సబ్-ఇన్స్పెక్టర్ తో పాటుగా, సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో నెల రోజుల పాటు ఇదే పనిపై వివిధ ప్రాంతాల్లో పరిశీలించి కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలని అన్నారు. స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి లేదా పోలీస్ లకు సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఇన్చార్జి డీఈఓ లక్ష్మణ్, డీసీపీఓ వెంకట స్వామి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ ఇనస్పెక్టర్ రమేష్, సీడబ్ల్యూసీ మెంబర్ దామోదర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద, వివిధ డిపార్ట్మెంట్ ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం



**విశ్వంభర, హనుమకొండ:** వరంగల్ కీ 112 ఎలెక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కేటాయించింది. మొదటి దశగా ఈరోజు 50 ఎలెక్ట్రిక్ బస్సులను హనుమకొండలోని హయగ్రీవ చారి గ్రౌండ్ లో మంత్రులు రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ,దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి ప్రారంబోత్సవంలో వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అశోక హోటల్ జంక్షన్ రోడ్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పై పిల్లలకు అవగాహన కల్పించే పార్కు శంకుస్థాపన మరియు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వరంగల్ కీ ప్రభుత్వం 112 ఎలెక్ట్రిక్ బస్సులను కేటాయించిందని, సంక్రాంతి లోపు మరో 25 బస్సులను ప్రారంబిస్తామని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, మహిళలు 4350 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని ఉచితంగా వినియోగించుకున్నారని, ఆర్టీసీ ఉద్యోగులు నిరంతరం శ్రామిస్తున్నారని అన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగులకు 2013 లో బాండ్లు ఇచ్చామని, 21శాతం పీఆర్సీ కుడా ఇచ్చామని, కారుణ్య నియామకాలను కుడా చేపట్టామని, ఇప్పుడు 3 వేల ఉద్యోగాలకు నియామకాలను చేపడుతున్నామని తెలిపారు. ఆర్టీసీని కాపాడుకొని ముందుకు తీసుకెళ్ళాల్సిన భాద్యత మన అందరిపైన ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ సి బస్వరాజు సారయ్య, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కే ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్ ఖాన్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రోడ్డు రవాణా సంస్థ అధికారులు, జిల్లా కలెక్టర్ లు పి.ప్రావీణ్య, సత్యశారద, ఎన్పీడీసీఎల్ ఛైర్మన్ తదితతరులు పాల్గొన్నారు.

## రేవంత్ సర్కార్‌ది రైతుని హింసించే ప్రభుత్వం

**జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్**



**విశ్వంభర, కడ్తాల్:** మాయ మాటలు చెప్పి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ రైతులను మరోసారి మోసం చేసిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న ఎకరానికి పదివేల రూపాయలు కాకుండా ఎకరానికి 15,000 రూపాయలు ఇస్తానని రైతులను మోసం చేసి, కేసీఆర్ ఇచ్చిన 10,000 రూపాయలు కూడా ఇవ్వట్లేదని ఫైర్ అయ్యారు. ఆరు గ్యారెంటీల పేరుతో 60 అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి తెలంగాణలో ఏ ఒక్క వర్గానికి రేవంత్ సర్కార్ న్యాయం చేయట్లేదని మండిపడ్డారు. హామీ ఇచ్చిన విధంగా తెలంగాణ రైతాంగానికి 15,000 రూపాయలు ఇవ్వాలని కడ్తాల్ ఎంఆర్ఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్, మాజీ సర్పంచ్లు నరసింహ, లోకేష్, ఎంపీటీసీలు చంద్రమౌళి జోగు వీరయ్య, మాజీ వార్డు సభ్యులు చంద్రయ్య,నరసింహ, సేవ్య నాయక్, మండల నాయకులు కంబాలపల్లి అంజి రంగయ్య, రవి, కసాగల్ల రమేష్, సిద్దిగారి వెంకటేష్ ,క్యమ వెంకటయ్య, శ్రీకాంత్,శ్రీను, శ్రీకాంత్, ప్రేమ్,ఉప సర్పంచ్ లు పార్టీ అధ్యక్షులు నాయకులు రైతులు పాల్గొన్నారు.

## డిండి ఎత్తిపోతలకు రాజగోపాల్ రెడ్డి కృషి హర్షనీయం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** డిండి ప్రాజెక్టు పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక నిర్ణయమని, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తో మునుగోడు నియోజకవర్గం లో తాగు సాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు.సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఆరు మాసాల క్రితం డిండి లో ఏర్పాటు చేసిన నీటిపారుదల సమావేశంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి వల్లనే ఈ ప్రాజెక్టును అంకురార్పణ దాల్చిందని డిండి ఎత్తిపోతల పథకానికి 1788 కోట్లతో ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించే అలైన్మెంట్ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించటం చారిత్రాత్మకమైన నిర్ణయమని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషి ఫలితం ఐబీ అధికారుల సహకారంతో ఈ ప్రాజెక్టు పూర్తయి ప్రజల, రైతంగా చిరకాల కోరికలు నెరవేరుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఏపూరి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రత్తుపల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్, కురిమీద గోపాల్,జక్కల శ్రీశైలం,జక్కల యాదయ్య, మహేశ్వరం విగ్నేశ్వర్, మందుగుల దానయ్య, సురకంటి జనార్దన్ రెడ్డి, రాసమల గాలయ్య,చిలువేరు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్టీరియా సంక్రమణలను ఎదుర్కోవచ్చు

**గీతం ఆతిథ్య ఉపన్యాసంలో నైపర్ ప్రొఫెసర్ పీవీ భరతం**



**విశ్వంభర, సంగారెడ్డి:** నూతన చికిత్సా లక్ష్యాల ద్వారా బ్యాక్టీరియా సంక్రమణలను ఎదుర్కోవచ్చని మొహాలిలోని నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) ప్రొఫెసర్ పీ.వీ.భరతం అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'యాంటీబాక్టీరియల్స్ టార్గెటింగ్ ఎఫ్.టీ.ఎస్.జడ్' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసనం చేశారు. కణ విభజనలో కీలక పాత్ర పోషించే బ్యాక్టీరియా సైటోస్కెలెటల్ ప్రొటీన్ అయిన ఎఫ్.టీ.ఎస్.జడ్ యొక్క ప్రాముఖ్యతను ప్రొఫెసర్ భరతం విశదీకరించారు. ఎఫ్.టీ.ఎస్.జడ్ విభజన ప్రదేశంలో జడ్-రింగ్ అని పిలువబడే రింగ్-వంటి నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, ఇది సైటోకినిసిస్ కు అవసరమైన ప్రొటీన్ కాంప్లెక్స్ అయిన డివైసోమ్ యొక్క గుంపునకు దోహదపడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఎఫ్.టీ.ఎస్.జడ్ మానవ కణాలలో లేదని, ఇది యాంటీ బాక్టీరియల్ ఔషధ అభివృద్ధికి ఆకర్షణీయమైన లక్ష్యంగా ఆయన అభివర్ణించారు. ఎఫ్.టీ.ఎస్.జడ్ నిరోధకాలు బ్యాక్టీరియా కణ విభజనకు అంతరాయం కలిగించడం ద్వారా ఎలా పనిచేస్తాయో ప్రొఫెసర్ భరతం వివరించారు. ఈ నిరోధకాలు ప్రొటీన్ యొక్క రసాయన ప్రక్రియ, జీటీపేజ్ కార్యాచరణ లేదా జడ్-రింగ్ ను రూపొందించే దాని సామర్థ్యంతో జోక్యం చేసుకుంటాయని, చివరకు సరైన సెప్టం ఏర్పడకుండా చేస్తుందన్నారు. ఫలితంగా, బాక్టీరియల్ కణాల వృద్ధి నిలిచిపోయి, చివరికి మరణిస్తాయని చెప్పారు. సహజ ఉత్పత్తులు, సింథటిక్ సమ్మేళనాలు, పెప్టైడ్-ఆధారిత నిరోధకాలు వంటి మూడు తరగతులుగా ఎఫ్.టీ.ఎస్.జడ్ నిరోధకాలను వర్గీకరించవచ్చని ప్రొఫెసర్ భరతం పేర్కొంటూ, ఈ నిరోధకాల యొక్క చికిత్సా సామర్థ్యాన్ని నొక్కి చెప్పారు. ఎఫ్.టీ.ఎస్.జడ్ ప్రొటీన్ యొక్క అత్యంత సంరక్షించబడిన, ఆవశ్యక స్వభావం కారణంగా సంప్రదాయ యాంటీబయోటిక్స్ తో పోలిస్తే ఎఫ్.టీ.ఎస్.జడ్ నిరోధకాలతో గమనించిన పరిమిత నిరోధకతను ఆయన ప్రస్తావించారు. ఎఫ్.టీ.ఎస్.జడ్ నిరోధకాలు ఇప్పటికే ఉన్న యాంటీబయాటిక్స్ యొక్క సామర్థ్యాన్ని పెంచగలవని, ప్రతిఘటన అభివృద్ధిని ఆలస్యం చేయగలవన్నారు.తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథిని స్వాగతించి, సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ అబిద్ అబ్దుల్లా వనీ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

## భారతీయ ప్రమాణాల బ్యూరోతో ఎన్ఐటీ వరంగల్ అవగాహన ఒప్పందం





**విశ్వంభర, వరంగల్:** వరంగల్ ఫాతిమా నగర్ సమీపంలోని ఎన్ఐటీ లో భారతీయ ప్రమాణాల రూపకల్పన, పరిశోధనలో సాంకేతిక విద్యార్థులను భాగం చేసేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తో ఎన్ఐటీ వరంగల్ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ 78వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆన్‌లైన్ వేదికగా పాల్గొన్న కేంద్ర వినియోగదారుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, వినియోగదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖారే, బీఐఎస్ డీజీ ప్రమోద్ కుమార్ తివారీ సమక్షంలో బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్, ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుభాధి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బీఐఎస్ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ మాట్లాడతూ.. 78 ఏళ్లుగా భారతీయ ప్రమాణాల రూపకల్పనలో బీఐఎస్ విశేష సేవలందిస్తుందని.. ఐఎస్ఐ మార్కు, బంగారు ఆభరణాలకు హాల్మార్కు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్ మార్కుల ద్వారా వినియోగదారులకు భరోసానిస్తోందన్నారు. ప్రమాణాల గురించి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించేందుకు, సాంకేతిక పరిశోధనల్లో భాగం చేసేందుకు దేశవ్యాప్తంగా ప్రఖ్యాత విశ్వవిద్యాలతో బీఐఎస్ ఒప్పందం చేసుకుంటుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఐటీ విద్యార్థులకు ప్రమాణాల రూపకల్పనతో పాటు సాంకేతిక కమిటీల్లో సభ్యులుగా చేరేందుకూ అవకాశం కల్పిస్తామన్నారు. కళాశాల కేంద్రంగా పరిశోధనలు చేసేందుకూ సహకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీనివాసాచార్య, రతీష్ కుమార్, వేణు వినోద్, శిరీష్, శ్రీనివాసరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, ఎస్పీఓ అభిసాయి ఇట్ట పాల్గొన్నారు.

## కేటగిరిల వారిగా వేతనాలు పెంచాలి



విశ్వంభర, ఆమనగల్లు: రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ఆమనగల్ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బయలు దేరారు. కేటగిరీల వారిగా వేతనాలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి ఈఎస్ఐ పీఎఫ్ లలో జరుగుతున్న అవకతవకలను నివారించాలని, కార్మికులందరికీ వారాంతపు సెలవులను మరియు లేబర్ డిపార్ట్మెంట్ ప్రతిపాదించిన జాతీయ సెలవులన్నింటిని కార్మికులందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కొత్త కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు అమలు చేసి క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వాలని, కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమనగల్ ఏరియా కన్వీనర్ జె పెంటయ్య, మున్సిపల్ జిల్లా నాయకులు ఒగ్గు రవి, హంసమ్మ, యాదమ్మ, నరసింహ, విజయ, చిట్టిబాబు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ రావు జన్మదిన వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బీజేపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా అధ్యక్షుడు డా. ఎన్. గౌతమ్ రావు పుట్టిన రోజు వేడుకలు హైదరాబాద్ బర్కత్ పుర లోని నగర కార్యాలయం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నాయకులు కార్యకర్తలు గౌతమ్ రావు ను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు అమృత, ఉమా రమేష్ యాదవ్, నేతలు ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, మోహన్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## కోరిన కోరికలు తీర్చే నర్సింహస్వామి



**విశ్వంభర, నల్లగొండ:** నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం తుంగపాహడ్ గౌరారంలో వెలిసిన సాలీడాన నర్సింహస్వామిని కీర్తిశేషులు శ్రీమతి %ఉ%శ్రీ దండు సత్తెమ్మ, మల్లేష్ గౌడ్ కుమారులు దండు వెంకటయ్య గౌడ్, దండు శేఖర్ గౌడ్, దండు తిరుపతయ్య గౌడ్, దండు శ్రీనివాస్ గౌడ్ ల కుమారులు కుమార్తెలు, అల్లుళ్లు, మనవళ్లతు, మనవరాళ్లు దర్శించుకున్నారు. మొత్తం 60 మంది అక్కడకు చేరుకొని లక్ష్మి నరసింహ స్వామికి మొక్కులు చెల్లించి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇక్కడికివచ్చి స్వామివారి మొక్కులు చెల్లించి కుటుంబసభ్యులతో సంతోషంగా గడుపుతామని చెప్పారు. అలాగే ఇక్కడ స్వామివారికి చాల మహిమ ఉందని, కోరిన కోరికలు తీర్చేస్వామి అని కొనియాడారు. అయితే రోడ్డు వసతి, కనీస సౌకర్యాలు సరిగ్గా లేవన్నారు. దీంతో భక్తులకు అసౌకర్యంగా ఉందని, ప్రభుత్వం పట్టించుకుని వసతులు మెరుగు పర్చాలని వీ3 న్యూస్ తో తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం పెరుగుతున్న నాగరికత కారణంగా కుటుంబ సభ్యులు ఉద్యోగం, వ్యాపార రీత్యా అందరు హైదరాబాదులో ఉంటున్నారని, పండుగలకు కూడా రాలేకపోయారని, పిల్లలకు అందరిని కలిసే సందర్భాలు కరువైయ్యాయని ఆవేదన చెందారు. అంతే కాకుండా ఉద్యోగం చేస్తూ బిజీగా ఉండే జీవితాలకు కాస్త విరామం ఇస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అందుకే ఏడాదికి రెండు సార్లు.. శ్రీరసనగండ్ల శ్రీరామక్షేత్రంలో, నర్సింహా స్వామి క్షేత్రం కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎంత సంపాదించినా కుటుంబ సభ్యులతో సమయం గడపటం చాలా తృప్తిగా ఉందని తెలిపారు. రోజులు మారుతున్నా.. తల్లిదండ్రులను మరవకూడదని సూచించారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం సహకరించకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని, కనీసం ఇలా అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారిలో మనో ధైర్యం పెరుగుతుందన్నారు. అయితే అర్కపల్లి మండలం మాడ్గుల్ జిల్లా రంగారెడ్డి అందరు వివిధ పార్టీలలో నాయకులే కావడం కొసమెరుపు. అనంతరం దండు వెంకటయ్య గౌడ్ పెద్దకుమారుడు స్టేట్ బ్యూరో దండు సురేష్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.



## మంత్రి శ్రీధర్ బాబుకు ఆత్మీయ సన్మానం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ఆత్మీయంగా సన్మానించారు. మినిస్టర్స్ క్వార్టర్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాల కు ఐటీ పరిశ్రమల శాఖ తరపున సహాయ సహకారాలు అందజేయాలని శివసేన రెడ్డి మంత్రి శ్రీధర్ బాబును కోరారు.

## కోచెస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ 2025 క్యాలెండర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ఆవిష్కరించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ రెడ్డి జితేందర్ గుప్తా, రమేష్ గౌడ్, ఫణీంద్ర, సాయి కుమార్, కుమారస్వామి, చైతన్య, ప్రవీణ్ కుమార్, జైపాల్ నాయక్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజల సమస్యలను పోలీసు అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని, బాధితులకు అండగా ఉంటూ సమగ్ర విచారణ జరిపి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమం సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన 16 మంది ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఎస్పీ మాట్లాడారు. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని పరిష్కరించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. సివిల్ పంచాయతీలు సాధ్యమైనంత వరకు కోర్టులో పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.

## కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ**





**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈనెల 20 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసనలు చేయాలని సోమవారం హైదరాబాద్బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ మావేశంలో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యం.వి.రమణ మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం పదివేల మందికి ఇచ్చారని మిగతా వృత్తి చేసే వారందరికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదం జరిగిన వారికి ఎక్స్‌గ్రేషియా నెల రోజుల లోపు ఇస్తామని చెప్పి సంవత్సరమైనప్పటికీ ఇవ్వలేదని వీటిని వెంటనే ఇవ్వాలన్నారు. నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ ను టాడి కార్పొరేషన్ కు అప్పగించాలని, నందనంలోని నీరా ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి వారికి కూడా సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి 22 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, వెంకట నర్సయ్య, పి అచ్చాలు, బాల్నే వెంకట మల్లయ్య, గౌని వెంకన్న, రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, బూడిద గోపి, బండ కింది అరుణ్, మడ్డి అంజిబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బిక్షం, ఎంకన్న, వెంకన్న, ఉప్పలయ్య, సుదర్శన్, లింగం పాల్గొన్నారు.

## టీజీ జీపీ యూనియన్ ఎంపీఓకు వినతి



**విశ్వంభర, నెల్లికుదురు:** తెలంగాణ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్మికులు వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఎంపీవో బానోతు పద్మకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షులు బందారి రాములు, సీనియర్ నాయకులు దూబర్ల సాయిలు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నప్పటికీ గత 8నుంచి10 మాసాలుగా జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గూగుల్ సునీల్, గుబ శ్రీనివాస్, పిచ్చయ్య, యాకన్న, నర్సయ్య, వెంకన్న, రవి, నరేష్, ఉప్పలయ్య, అశోక్ రెడ్డి, సుధాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# యాచకుల సమాచారమిస్తే రూ.వెయ్యి బహుమతి..

### దీంతో వందల సంఖ్యలో ఫోన్‌కాల్స్!

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌ను యాచకులు లేని నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే భిక్షాటన చేస్తూ కనిపించే వారి గురించి సమాచారం అందించి వారికి రూ. వెయ్యి బహుమతి ప్రకటించింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగానికి వందల సంఖ్యలో ఫోన్ కాల్స్ పొటెత్తాయి. ''భిక్షాటన చేస్తూ కనిపించిన వారి గురించి సమాచారం ఇస్తే రూ. వెయ్యి బహుమతి అందిస్తామని జనవరి 2న ప్రకటించాం. ఒక ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచాం. నాలుగు రోజుల వ్యవధిలోనే సుమారు 200 కాల్స్ వచ్చాయి'' అని ఉన్నతాధికారులు తెలిపారు. అయితే.. తమకు వచ్చిన కాల్స్‌కు సంబంధించిన వివరాలను విచారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వీటిలో 12 మంది సరైన సమాచారం అందించారని.. మిగిలిన వాటిని కూడా పరిశీలిస్తున్నామన్నారు. కాగా.. యాచకులు లేని నగరంగా మార్చేందుకు ఇండోర్ యంత్రాంగం అనేక చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. యాచకులకు డబ్బు ఇచ్చినా.. వారి కోసం ఇతర వస్తువులను అందించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించే అవకాశం ఉంటుందని పేర్కొంది. అయితే.. నాలుగు నెలల్లో 400 మంది యాచకులను పునరావాస కేంద్రాలకు పంపగా.. 64 మంది చిన్నారులను పిల్లల సంరక్షణ సంస్థకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.

## హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్సేం కాదు..

### భయపడాల్సిన అవసరంలేదు: జేపీ నడ్డా



**ఢిల్లీ:** దేశంలో మూడు హ్యూమన్ మెటానిమో వైరస్ కేసులు నమోదు కావడంపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ వైరస్ కొత్తదేమీ కాదని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖతో పాటు ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ నిశితంగా గమనిస్తున్నాయన్నారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ''హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదని ఆరోగ్య రంగ నిపుణులు స్పష్టంచేశారు. ఈ వైరస్‌ని 2001లో గుర్తించారు. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిలో ఉంది. గాలి, శ్వాసప్రక్రియ ద్వారా ఇది వ్యాపిస్తుంది. అన్ని వయసుల వారినీ ప్రభావితం చేస్తుంది.శీతాకాలం, వసంత రుతువు ప్రారంభంలో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం.. చైనాలో ఈ వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్యమంత్రిత్వశాఖ, ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ చైనాతో పాటు పొరుగు దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఈ పరిస్థితిని గమనంలోకి తీసుకొని.. త్వరలోనే నివేదికను మనకు షేర్ చేస్తుంది. ఐసీఎంఆర్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్‌తో మన దేశంలోని శ్వాసకోశ వైరస్‌లకు సంబంధిత డేటాను సమీక్షించాయి. సాధారణ వ్యాధికారక వైరస్‌లలో ఏ విధమైన పెరుగుదల నమోదు కాలేదు. ఈ పరిస్థితిపై సమీక్షించేందుకు జనవరి 4న డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఫర్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ సమావేశం జరిగింది. దేశంలోని ఆరోగ్య వ్యవస్థలు, నిఘా నెట్‌వర్క్‌లు అప్రమత్తంగా ఉన్నాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. ఆరోగ్యపరమైన సవాళ్లపై తక్షణ స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. అందువల్ల భయపడాల్సిన అవసరం లేదు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం.'' అని నడ్డా పేర్కొన్నారు.

## భారత్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్..

### ఆందోళన అవసరం లేదన్న కేంద్రం

**ఢిల్లీ:** చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ విజృంభిస్తోన్న వార్తలు వస్తోన్న నేపథ్యంలో.. భారత్‌లోనూ ఈ కేసులు వెలుగు చూడటం కలవరపాటుకు గురిచేస్తోంది. దీనిపై స్పష్టతనిచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. మిగతా శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. దేశంలో ఇన్‌ఫ్లుయెంజా మాదిరి వ్యాధులు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు అసాధారణ రీతిలో ఏమీ లేవని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. ''ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే హెచ్‌ఎంపీవీ ఉంటుంది. సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది'' అని కేంద్ర ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ పేర్కొన్నారు. సీజనల్ శ్వాసకోశ సంబంధింత కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో భారత్‌లోని ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శీతాకాలంలో అవసరమైన జాగ్రత్తలు వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**భారత్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్ కలకలం.. ముగ్గురికి పాజిటివ్**

మరోవైపు జన్యు పరివర్తన జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం మినహాయించి హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగాఖేడ్కర్ ఓ మీడియా సంస్థతో చెప్పారు. ప్రస్తుత రకం వైరస్‌తో ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు.

**సాధారణ వైరస్..?**

హ్యూమన్ మెటానిమోవైరస్ అనేది ఇదివరకే తెలిసిన వైరస్. ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం వరకు ఇదే కారణమవుతోందని అంచనా. రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్‌ని పోలి ఉండే ఈ వైరస్.. ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల మాదిరిగానే కనిపిస్తుంది. తక్కువ రోగనిరోధక శక్తి కలిగిన వాళ్లలోనే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. సాధారణంగా 11ఏళ్ల చిన్నారుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. తొలిసారిగా దీనిని 2001లో నెదర్లాండ్స్‌లో 28 మంది చిన్నారుల్లో గుర్తించారు.



### జర్నలిస్టు ముఖేశ్ కేసులో..

# ఒళ్లు గగుర్పొడిచే అంశాలు

**విశ్వంభర, హైదరాబాద్:** రూ.120 కోట్లు విలువైన కాంట్రాక్టులో అవినీతిని బయటపెట్టినందుకు హత్యకు గురైన జర్నలిస్టు ముఖేశ్ కేసులో ఒళ్లు గగుర్పొడిచే అంశాలు వెలుగుచూస్తున్నాయి. హంతకులు అతడిని దారుణంగా కొట్టి.. గుండెను చీల్చి బయటకు తీసినట్లు శవ పరీక్షల్లో తేలింది. ఇప్పటికే నిందితుడిని ఆదివారం హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ముఖేశ్ మృతదేహానికి డాక్టర్లు శవ పరీక్షను ముగించారు. అతడి కాలేయం నాలుగు ముక్కలైనట్లు గుర్తించారు. అంతేకాదు.. అతడి పక్కటెముకలు ఐదు చోట్ల, తలపై 15 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. అతడి గుండెను చీల్చినట్లు తేలింది. తమ 12 ఏళ్ల కెరీర్‌లో ఇంత భయానక హత్యను ఎన్నడూ చూడలేదని డాక్టర్లు వెల్లడించారు. ఇద్దరు కంటే ఎక్కువమందే ఈ హత్యలో పాల్గొన్నట్లు అనుమానం వ్యక్తంచేశారు.





బస్తర్‌కు చెందిన ముకేశ్.. అదే ప్రాంతంలోని గంగలూరు నుంచి హిరోలి వరకు రూ.120 కోట్లతో చేపట్టిన రోడ్డు ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కథనం వెలువరించాడు. తొలుత రూ.50 కోట్ల టెండర్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు.. పూర్తిస్థాయి అభివృద్ధి జరగకపోయినప్పటికీ రూ.120 కోట్లకు చేరుకుందని వెల్లడించాడు. అనంతరం అతడు కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్ ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో శవమై కనిపించాడు. పచ్చబొట్టు ఆధారంగా అతడిని గుర్తించారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో రితీష్, దినేషలు మృతుడికి బంధువులే.

**హైదరాబాద్‌లో కీలక నిందితుడి అరెస్ట్..**

ముఖేశ్ కేసులో కీలక నిందితుడైన కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అతడు ముకేశ్‌కు దూరపు బంధువు కూడా. హత్య జరిగిన రోజు నుంచి సురేశ్ కూడా అదృశ్యం కావడంతో పోలీసులు అతడిపై నిఘా వేశారు. చివరికి హైదరాబాద్‌లో తన డ్రైవర్‌కు ఉన్న ఇంట్లో అతడు నక్కినట్లు గుర్తించారు. ఇందుకోసం దర్యాప్తు బృందాలు 200 సీసీ కెమెరాలను, 300 మొబైల్ నెంబర్లపై నిఘా వేశారు. ఇప్పటికే సురేశ్‌కు చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసి.. అక్రమంగా నిర్మిస్తున్న యార్డును ధ్వంసం చేశారు. అతడి భార్యను కూడా కస్టడీలోకి తీసుకొని ఇంటరాగేట్ చేస్తున్నారు.

**హత్య ఎలా చేశారంటే..**

జర్నలిస్టు ముఖేశ్‌కు వరుసకు సోదరుడయ్యే రితీశ్, సూపర్‌వైజర్ మహేంద్రతో భోజనం చేసే సమయంలో వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో వారిద్దరూ తొలుత ఇనుప రాడ్డుతో దాడి చేశారు. దీంతో ముఖేశ్ వెంటనే ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత మహేంద్ర పర్యవేక్షణలో అతడి శరీరాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పడేసి.. సిమెంట్‌తో మూసివేశారు. అనంతరం ముఖేశ్ ఫోన్, దాడికి వాడిన ఇనుప రాడ్డును పారేశారు. ఈ హత్యకు సురేశ్‌ను మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్నారు.

## ప్రసంగం చేయకుండానే గవర్నర్ వాకౌట్..

**చెన్నై:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, అధికార డీఎంకే ప్రభుత్వానికి మధ్య కొంత కాలంగా సంబంధాలు సజావుగా ఉండటం లేదన్న విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఇరుపక్షాల మధ్య వివాదం తలెత్తింది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదని ఆరోపిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి.. ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయంటూ అనంతరం ట్వీట్ చేశారు.





''తమిళనాడు అసెంబ్లీలో రాజ్యాంగం, జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగింది. జాతీయ గీతాన్ని గౌరవించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక విధి. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ప్రారంభం, ముగింపు సమయంలో దీనిని పాడతారు. కానీ, ఇక్కడ మాత్రం అలా జరగలేదు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి, స్పీకర్‌కు గుర్తుచేసినప్పటికీ.. వారు తిరస్కరించారు'' అని పేర్కొంటూ గవర్నర్ ఆర్ఎన్ రవి సభ నుంచి వాకౌట్ చేశారు. తమిళనాడులో అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో రాష్ట్ర గీతం తమిళ థాయ్ వాల్తును.. ముగింపు వేళ జాతీయ గీతాన్ని ఆలపించడం ఆనవాయితీగా వస్తోంది. తాజాగా ఇదే అంశాన్ని లేవనెత్తిన గవర్నర్ ఆర్ఎన్ రవి.. రెండు సమయాల్లో జాతీయ గీతాన్ని ఆలపించాలని అన్నారు. ఇందుకు సీఎం, స్పీకర్‌లు తిరస్కరించడంతో గవర్నర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**గవర్నర్ తీరును తప్పుపట్టిన సీఎం..**

అసెంబ్లీ నుంచి గవర్నర్ ఆర్ఎన్ రవి వెళ్లిపోవడాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తప్పుపట్టారు. రాష్ట్ర ప్రజలను, ప్రభుత్వాన్ని ఆయన ఎప్పుడూ అవమానిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్ తీరుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా జనవరి 7న నిరసనలు చేపట్టాలని డీఎంకే నిర్ణయించింది.

## ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా..?

### తన ఇంటిపేరుపై బీజేపీ నేత వ్యాఖ్యలు.. సీఎం ఆతీశీ భావోద్వేగం

**ఢిల్లీ:** తన ఇంటి పేరును లక్ష్యంగా చేసుకొని బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతీశీ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. ''సీఎం ఆతీశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా.. ప్రస్తుతం మరో పేరును వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు'' అంటూ బీజేపీ నేత రమేశ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై విలేకరుల సమావేశంలో స్పందించిన ఆతీశీ మండిపడ్డారు. ''నా తండ్రి ఒక ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన ఒకరి సహాయం లేనిదే నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా..?ఒక వృద్ధుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. దేశంలో రాజకీయాలు దిగజారిపోతున్నాయంటే నమ్మలేకపోతున్నాను'' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.రమేశ్ బిధూడీ వ్యాఖ్యలపై మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. మహిళా సీఎం పట్ల ఇలాంటి ప్రవర్తనను ఢిల్లీ ప్రజలు సహించరని అన్నారు. ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. కాగా.. త్వరలో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆప్ తరఫున కల్కాజీ నియోజకవర్గం నుంచి ఆతీశీ బరిలోకి దిగుతుండగా.. అదే స్థానంలో భాజపా నుంచి రమేశ్ బిధూడీ పోటీ చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీని ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయన.. ఆతీశీ ఇంటి పేరుపై అనుచితంగా మాట్లాడారు. ఆయన తీరుపై కాంగ్రెస్, ఆప్ మండిపడుతున్నాయి.



## అఫ్గాన్‌కు మద్దతుగా భారత్.. పాక్‌పై మండిపాటు

**ఢిల్లీ:** అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులు చేసి పౌరులను పొట్టన పెట్టుకుంది. అఫ్గాన్‌కు మద్దతుగా స్పందించిన భారత్ పాక్ చర్యపై తీవ్ర స్థాయిలో విరుచుపడింది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాక్‌కు అలవాటుగా మారిందని మండిపడింది. మహిళలు, చిన్నారులు సహా అఫ్గాన్ పౌరులపై వైమానిక దాడులు జరగడం పట్ల భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ''అమాయక పౌరులపై దాడి జరిగితే భారత్ నిస్సందేహంగా ఆ చర్యను ఖండిస్తుంది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారింది. ఈ అంశంపై అఫ్గాన్ అధికార ప్రతినిధి మాట్లాడిన విషయం కూడా మా దృష్టికి వచ్చింది'' అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.



కాగా.. అఫ్గాన్‌ను తాలిబన్‌లు ఆక్రమించుకున్న తర్వాత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇటీవల తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాకిస్థాన్ ఆరోపించింది. ఈ క్రమంలోనే గతేడాది మార్చిలో అఫ్గాన్‌పై దాడులు చేసిన పాక్.. మరోసారి డిసెంబర్‌లో వైమానిక దాడులతో విరుకుపడింది. తూర్పు పక్తికా ప్రావిన్స్‌లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఇందులో దాదాపు 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరికొందరి పరిస్థితి విషమయంగా ఉన్నట్లు తాలిబన్ల ప్రభుత్వం వెల్లడించింది. తమ దేశంపై దాడులకు పాల్పడిన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే అఫ్గాన్‌పై పాక్ దాడులపై విలేకరుల సమావేశంలో ఎదురైన ప్రశ్నకు భారత్ తరఫున రణ్‌ధీర్ జైస్వాల్ ఈ విధంగా స్పందించారు.

## ఆంధ్రప్రదేశ్ ఓటర్లు @ 4,14,40,447.. పెరిగిన పోలింగ్ కేంద్రాలు

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో 2025 జనవరి 1 నాటికి తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,40,447గా ఉందని ఎన్నికల సంఘం వెల్లడించింది. వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 2,10,81,814, పురుష ఓటర్లు 2,02,88,543 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 66,690 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 3400 మంది ఉన్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 1819 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 5,14,646 మంది ఉన్నారు. రాష్ట్రంలో 46,397 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 232 పోలింగ్ కేంద్రాలు పెరిగాయని పేర్కొంది.





## రద్దీ ప్రదేశాల్లో మాస్కు ధరించండి

### - కర్ణాటక సర్కార్ అడ్వైజరీ

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ సోకడంతో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్ కొవిడ్‌లా వ్యాప్తి చెందేది కాదని.. అందువల్ల ఎవరూ భయపడొద్దని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అడ్వైజరీని విడుదల చేసింది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని కోరింది. ఈ శ్వాసకోశ సంబంధిత వైరస్ ప్రాథమికంగా పిల్లలపై ప్రభావం చూపిస్తుందని, వారిలో సాధారణంగా జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అడ్వైజరీలో పేర్కొంది. ఇన్‌ఫ్లూయెంజాలాంటి అనారోగ్యం తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ల వంటి కేసులను రిపోర్టు చేయాలని రాష్ట్రంలోని ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు పలు సూచనలు చేసింది. ఎవరైనా దగ్గు, తుమ్మిన సమయంలో నోరు, ముక్కును కప్పి ఉంచుకోవాలని, తరచూ సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని డీఎంఈ సూచించింది. ఈ వైరస్ లక్షణాలు ఉన్నవారు, రోగులకు సన్నిహితంగా ఉన్నవారు బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. వాడిన టిష్యూ పేపర్లు తిరిగి ఉపయోగించొద్దని.. రుమాలు, తువ్వాలును షేర్ చేసుకోవద్దని కోరింది. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయొద్దని ప్రజలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది. డీఎంఈ తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎంపీవీ సోకితే దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది వంటి ఫ్లూలాంటి లక్షణాలు కనబడతాయి. మరింత తీవ్రమైన కేసుల్లో అయితే ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి లేనివారిలో ఇది బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయొచ్చని తెలిపింది. హెచ్‌ఎంపీవీకి నిర్దిష్టమైన యాంటీ వైరల్ చికిత్స, టీకాలు అందుబాటులో లేవన్న డీఎంఈ.. తగిన విశ్రాంతి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం వంటి చర్యలు కొంత ఉపశమనం కలిగిస్తాయని తెలిపింది. తీవ్రమైన కేసుల్లో అయితే, ఆస్పత్రిలో చేరి ఆక్సిజన్ థెరపీ, ఐవీఫ్లూయిడ్స్ అవసరమవుతాయని పేర్కొంది.

## బెంగళూరులో హెచ్‌ఎంపీవీ వైరస్ కలకలం..

**బెంగళూరు/ ఢిల్లీ:** బెంగళూరులో 3, 8 నెలల వయసున్న ఇద్దరు చిన్నారుల్లో హెచ్‌ఎంపీవీ వైరస్ పాజిటివ్‌గా తేలడంపై కర్ణాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలో మూడు కేసులు బయటపడినట్లు ఐసీఎంఆర్ ధ్రువీకరించడంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ''ఇద్దరు చిన్నారులకు వైరస్ సోకింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావుతో మాట్లాడాను. ఆయన సత్వరమే స్పందించి ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వం అమలు చేస్తుంది. ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం'' అన్నారు.

ఇదేం కొత్త వైరస్ కాదు కాదు.. దినేశ్ గుండూరావు

బెంగళూరులో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదు కావడంపై కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు స్పందించారు. చైనాలో ఈ వైరస్ వ్యాప్తి, తాజా పరిస్థితులతో నెలకొన్న పరిణామాలను తమ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందన్నారు. హెచ్‌ఎంపీవీ చాలా కాలంగా ఉన్నదేనని.. ఈ వైరస్ సోకితే సాధారణ జలుబు, ఫ్లూ, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇటీవల నమోదైన కేసును ఇదే మొదటిది అని రిపోర్టు చేయడం తప్పుదోవపట్టించడమే అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ వైరస్ ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. మన దేశంలో తాజాగా నమోదైన కేసులు స్థానిక స్ట్రెయిన్‌కు సంబంధించినవే కావొచ్చన్న మంత్రి.. చైనాలో వ్యాప్తి చెందుతున్న వైరస్‌తో వీటికి సంబంధం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కేసుల నిర్ధారణకు పీసీఆర్ పరీక్ష చేయాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. చైనాలో గుర్తించిన స్ట్రెయిన్‌ను విశ్లేషించాల్సిన అవసరం ఉందన్నారు.

పరిస్థితి చేయిదాటిపోనివ్వొద్దు: కేజ్రీవాల్

మరోవైపు, చైనాలో కలకలం రేపిన హెచ్‌ఎంపీవీ వైరస్ భారత్‌లో వ్యాప్తిపై ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కొవిడ్ సమయంలో నేర్చుకున్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సత్వర చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పరిస్థితి చేయిదాటిపోకుండా మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాలని, మరో ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి రాకుండా నివారించాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.



# 'స్వర్ణ కుప్పం'.. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**విశ్వంభర, కుప్పం:** వైసీపీ హయాంలో రాష్ట్రం వెనుకబడిందని.. అప్పుల కుప్పగా మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కష్టపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో నాడు తాను చేసిన అభివృద్ధి ఫలాలే ఇప్పుడు వస్తున్నాయని చెప్పారు. 201419 మధ్య ఏపీని అభివృద్ధి పథంలో నడిపించామని చెప్పారు. ద్రవిడ యూనివర్సిటీలో 'స్వర్ణ కుప్పం విజన్ 2029' డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ప్రతి ఇంటికీ పారిశ్రామికవేత్త ఉండాలనేది తన విజన్ అని చెప్పారు. ''రాబోయే రోజుల్లో కుప్పంను ఎలా అభివృద్ధి చేస్తామో ప్రణాళికలు రచించాం. ఏటా ఎలాంటి పనులు చేపట్టాలనేదానిపై ఆలోచన చేశాం. కుప్పానికి పెట్టుబడులు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తాం. జీవితం ఎవరికీ జాక్‌పాట్ కాదు. ఒకసారి అవకాశం వస్తుంది.. దాన్ని సద్వినియోగం






చేసుకోకపోతే వైకుంఠపాళి తరహా పరిస్థితే ఎదురవుతుంది. రాజకీయం, వ్యాపారం సహా అన్ని రంగాలకూ ఇది వర్తిస్తుంది.
ఈసారి నియోజకవర్గాల వారీగా విజన్ తయారు చేస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఆకాంక్షలను ఎప్పటికప్పుడు నెరవేర్చగలిగితే.. అలాంటి నేతలు శాశ్వతంగా ఎమ్మెల్యేలుగా ఉంటారు. తెదేపా ఆవిర్భావం తర్వాత కుప్పంలో తెదేపా తప్ప వేరే పార్టీ జెండా ఎగరలేదు. పోటీ చేసిన అన్ని సార్లూ ప్రజలు గెలిపించారు. కుప్పం ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు. విజన్ డాక్యుమెంట్ విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రతి ఇంటిలోనూ దీనిపై చర్చ జరగాలి. ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇవ్వాలనే ఆలోచన యువతలో ఉండాలి'' అని చంద్రబాబు అన్నారు.



## హెచ్‌ఎంపీవీ ముప్పు.. అప్రమత్తంగా ఉన్నాం

**- ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విశ్వంభర, అమరావతి:** కర్ణాటక, గుజరాత్‌లో హ్యూమన్ మెటానిమో వైరస్ కేసులు బయటపడిన నేపథ్యంలో అప్రమత్తమైనట్లు ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రానికి వైరస్ వల్ల ఎలాంటి ముప్పు లేదని ఇప్పటికే ఐసీఎంఆర్ ప్రకటించిందని స్పష్టం చేశారు. నూతన వైరస్‌పై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. కావాల్సిన వైద్య పరికరాలను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ''పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను కూడా సిద్ధంగా ఉంచాం. యాంటీ డ్రగ్ డోస్ మందులను సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో నూతన ప్రొటోకాల్ అమలు చేస్తున్నాం'' అని మంత్రి వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వంతో రైతుల కుటుంబాల్లో సంక్రాంతి సందడి: మంత్రి నాదెండ్ల



**విశ్వంభర, అమరావతి:** ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం నాటికి 27లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని చెప్పారు. ధాన్యం సేకరణపై మంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''4,15,066మంది రైతుల నుంచి ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించాం. వైకాపా హయాంలో కేవలం 2 లక్షల మంది రైతుల నుంచే ధాన్యం కొన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.6,083.69 కోట్లు జమ చేశాం. వైకాపా హయాంలో ధాన్యం డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వలేదు. రైతుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం సంక్రాంతి సందడి తెచ్చింది''అని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## పేర్ని నాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ




**విశ్వంభర, అమరావతి:** రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పేర్నినానిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను 8వ తేదీ వరకు పొడిగించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను 7వ తేదీకి వాయిదా వేసింది. రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నానిని ఏ6గా చేరుస్తూ మచిలీపట్నం తాలూకా పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. నాని ఆదేశాల మేరకే లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదైన నేపథ్యంలో ఆయన పరారీలో ఉన్నారు.

**బర్త్ డే సెలబ్రేట్ చేసుకున్న తర్వాత..**


## హాస్టల్ బిల్డింగ్ పైనుంచి పడి ఐఐఎం విద్యార్థి మృతి



**బెంగళూరు:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విద్యార్థి అర్ధరాత్రి వేళ స్నేహితులతో కలిసి తన పుట్టిన రోజు జరుపుకున్నాడు. కేక్ కట్ చేసి ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేశాడు. ఆ తర్వాత హాస్టల్‌కు తిరిగి వెళ్తూ బిల్డింగ్ రెండో అంతస్తు పైనుంచి కింద పడి మరణించాడు. దీంతో ఆ క్యాంపస్‌లో తీవ్ర విషాదం నెలకొన్నది. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన నిలయ్ కైలాష్‌భాయ్ పటేల్, బెంగళూరులోని ఐఐఎంలో పీజీపీ చదువుతున్నాడు. జనవరి 4న అతడు 29వ ఏట ప్రవేశించాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి వేళ హాస్టల్‌లోని ఫ్రెండ్ రూమ్‌లో బర్త్ డే సెలబ్రేట్ చేసుకున్నాడు. స్నేహితులతో కలిసి కేక్ కట్ చేశాడు. వారితో కలిసి ఎంజాయ్ చేశాడు. ఆ తర్వాత హాస్టల్‌లోని తన రూమ్‌కు తిరిగి వెళ్లాడు.కాగా, ఆదివారం తెల్లవారుజామున 6.30 గంటలకు హాస్టల్ బిల్డింగ్ వద్ద నిలయ్ కైలాష్‌భాయ్ పటేల్ పడి ఉండటాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించాడు. అతడ్ని ఆసుపత్రికి తరలించారు. అయితే నిలయ్ అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బర్త్ డే సెలబ్రేషన్ తర్వాత హాస్టల్‌లోని తన గదికి వెళ్తూ రెండో అంతస్తు నుంచి కింద పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. కాగా, నిలయ్ మరణం పట్ల ఐఐఎంబీ సంతాపం తెలిపింది. బ్రిలియంట్, ఫ్రెండ్లీ స్టూడెంట్‌ను కోల్పోయినట్లు పేర్కొంది.

## కేవీ రావు ఎవరో నాకు తెలియదు

**- విజయసాయి రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** కాకినాడ పోర్టు సెజ్‌కు సంబంధించిన కేసులో వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ముగిసింది. విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరు గంటలపాటు అధికారులు ప్రశ్నించినట్లు చెప్పారు. మొత్తం 25 ప్రశ్నలు అడిగారన్నారు.
''కేవీ రావు చేసిన ఆరోపణలపై నన్ను ప్రశ్నించారు. కేవీ రావు ఎవరో నాకు తెలియదు. ఆయన నా పేరు ఎందుకు చెప్పారో తెలీదు. ఆయన్ని నేనెక్కడా కలవలేదు. పలు విషయాలపై నన్ను అనేకమంది కలుస్తుంటారు. కాకినాడ సీ పోర్టుపై కేవీ రావుకు నేనెప్పుడూ ఫోన్ చేయలేదు. ఆయన్ని తిరుమల స్వామి వద్దకు రావాలని కోరుతున్నా. ఆయన ఫిర్యాదులు నిజమైతే వెంకటేశ్వరస్వామి ఎదుట చెప్పాలి. స్వామి సమక్షంలోనే నిజానిజాలు మాట్లాడుకుంటాం. మే నెలలోని కాల్ డేటా రికార్డ్స్‌ని తెప్పించండి.
నేను కేవీ రావుకు ఫోన్ చేసినట్లు తేలితే చేసిన తప్పును అంగీకరిస్తాను. ఒకవేళ ఆయన చెప్పింది నిజమే అయితే.. ఇద్దర్నీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించండి. నేను ఎంపీని. నాకు ప్రభుత్వంలో జరిగేవి తెలీదు. ఈడీ అధికారులు అడిగినప్పుడు కూడా అదే చెప్పాను. శరత్ చంద్రారెడ్డితో నాకు బంధుత్వమే తప్ప వ్యాపార సంబంధాలు లేవు. కాకినాడ పోర్ట్స్ వ్యవహారంలో నాకు లుక్‌అవుట్ నోటీసులు వచ్చేంత వరకు నాకు తెలియదు. కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు తప్పని తేలితే అతడిపై పరువు నష్టం దావా వేస్తా'' అని విజయసాయిరెడ్డి అన్నారు.
వైకాపా హయాంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ (కేఎస్‌పీఎల్), కాకినాడ సెజ్ (కేసెజ్)ల్లోని రూ.3,600 కోట్ల విలువైన షేర్లను కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) నుంచి బలవంతంగా లాగేసుకున్న కేసులో ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డికి గతంలోనే నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని సూచించింది. పార్లమెంట్ సమావేశాల కారణంగా ఆయన హాజరు కాలేదు. దీంతో మళ్లీ నోటీసులు ఇవ్వడంతో విజయసాయిరెడ్డి నేడు విచారణకు హాజరయ్యారు.

## టీడీపీ నేతలపై దాడి కేసులో తురకా కిశోర్‌కు 14 రోజుల రిమాండ్



**విశ్వంభర, పల్నాడు:** టీడీపీ నేతలు బొండా ఉమా మహేశ్వరరావు, బుద్ధా వెంకన్నపై దాడి కేసులో నిందితుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్‌కు మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం అతడిని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఏపీ పోలీసులు.. కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం రెండు వారాల రిమాండ్ విధించింది.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అరాచకాలకు పాల్పడటంతో నమోదైన కేసుల నేపథ్యంలో మే 22న పిన్నెల్లి సోదరులు హైదరాబాద్‌కు పారిపోయారు. అప్పటి నుంచి వారి అనుచరులు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. తరువాత పిన్నెల్లి సోదరులిద్దరూ ముందస్తు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలలుగా కిశోర్.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తన అన్న శ్రీకాంత్ వద్దే ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసేందుకు వస్తున్నాడన్న సమాచారం మేరకు విజయపురి సౌత్ ఠాణా ఎస్సై షఫీ బృందం రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఉదయం కిశోర్‌ను, అతని సోదరుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని.. మాచర్లకు తీసుకొచ్చారు. కిశోర్‌పై మూడు హత్యాయత్నాలతోపాటు మరో ఏడు ఇతర కేసులున్నాయి.గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైకాపా నేతలు మాచర్ల నియోజకవర్గంలోని బొదిలవీడులో తెదేపా వారిని నామినేషన్లు వేయనీయకుండా కిశోర్ అడ్డుకున్నారు. దీంతో పార్టీ ఎన్నికల పరిశీలకులుగా బొండా ఉమ, బుద్ధా వెంకన్నలను చంద్రబాబు అక్కడికి పంపారు. వీరి కారు మాచర్ల సాగర్ రింగ్‌రోడ్డు వద్దకు రాగానే కర్రలు, కత్తులతో సిద్ధంగా ఉన్న వైకాపా నేతలు దాడులకు తెగబడ్డారు. బొండా ఉమ, బుద్ధా వెంకన్నలు ప్రయాణిస్తున్న కారు అద్దాల్లో నుంచి పెద్ద కర్రలతో కిశోర్ వారిపై దాడి చేశాడు. ఈ వీడియోలు అప్పట్లో సంచలనం రేకెత్తించాయి. ఆ దాడిలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అతడిపై చర్యలు తీసుకోవాలంటూ తెదేపా నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని ఆదివారం అరెస్టు చేశారు.

## హెచ్‌ఎంపీవీ వ్యాప్తి.. ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్




**విశ్వంభర, అమరావతి:** భారత్‌లో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో కేసులు నమోదైన విషయాన్ని గుర్తు చేస్తూ.. అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2001నుంచి ఈ వైరస్ ఉన్నట్లుగా తెలిపారు. ఇప్పటి వరకు ఏపీలో ఎలాంటి హెచ్‌ఎంపీవీ కేసులు నమోదు కాలేదన్నారు. అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ లాంటి శ్వాసకోశ వ్యాధులు, ఇన్‌ఫ్లూయెంజా లాంటి కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. మైక్రోబయాలజిస్టులు, పీడియాట్రిషియన్లు, పల్మనాలజిస్టులు, ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణులతో టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు.హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టాస్క్ ఫోర్స్ నుంచి సలహాలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఈ వైరస్ సీజనల్ వ్యాధిగా సంక్రమిస్తున్నప్పటికీ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ఐసీఎంఆర్ అధీకృత వైరాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేయాలని సూచించారు. వైరస్ టెస్టింగ్ కిట్లను కూడా సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించారు. తక్షణమే 3 వేల టెస్టింగ్ కిట్లను తెప్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఔషధాల లభ్యతపైనా సీఎం ఆరా తీశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4.5 లక్షల ఎన్95 మాస్కులు, 13.71 లక్షల ట్రిపుల్ లేయర్డ్ మాస్కులు, 3.52 లక్షల పీపీఈ కిట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో వీటి సరఫరాను పెంచాలని సీఎం ఆదేశించారు. శానిటైజర్లను, ఔషధాలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాసుపత్రుల్లో 20 పడకల ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. ఆక్సిజన్ సరఫరా, లిక్విడ్ ఆక్సిజన్ సప్లై పైపులైన్లకు సంబంధించి అన్ని ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించాల్సిందిగా సీఎం ఆదేశించారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలు కనీసం 20 సెకండ్లపాటు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ వినియోగించాలని సూచించారు.

## సంక్రాంతి రద్దీ.. శ్రీకాకుళానికి ప్రత్యేక రైళ్లు



**శ్రీకాకుళం:** సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. కాచిగూడ/చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్ మధ్య ఆరు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించింది. జనవరి 11, 12, 15, 16 తేదీల్లో కాచిగూడ శ్రీకాకుళం రోడ్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. అలాగే, చర్లపల్లి శ్రీకాకుళం రోడ్డుకు 8, 9 తేదీల్లో రెండు రైళ్లు సర్వీసులందిస్తాయి.
కాచిగూడ శ్రీకాకుళం రోడ్ (07615) రైలు జనవరి 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. అలాగే, జనవరి 12, 16 తేదీల్లో శ్రీకాకుళం రోడ్ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుకోనుంది. ఈ రైలు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది. ఈ రైలులో అన్నీ థర్డ్ ఏసీ కోచ్‌లే.చర్లపల్లి శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు (07617) జనవరి 8న చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకోనుంది. అలాగే, శ్రీకాకుళం రోడ్ చర్లపల్లి (07618) రైలు.. జనవరి 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ. శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది.

## 'రియల్' రంగం ఇబ్బంది పడకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి నారాయణ



**విశ్వంభర, విజయవాడ:** గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, బిల్డర్లు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ వేస్తున్నామని.. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. అపార్ట్‌మెంట్లు, లే అవుట్‌లలో కొనుగోలు విషయంలో వినియోగదారులు మోసపోకుండా రెరా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. బిల్డర్‌లు, వినియోగదారుల మధ్య జరిగిన ఒప్పందాలు సరిగ్గా అమలు అవుతున్నాయో లేదో చూడాల్సిన బాధ్యత రెరాదేనని మంత్రి తేల్చి చెప్పారు. ఇవాళ వచ్చిన కొన్ని ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలని రెరాను ఆదేశించినట్లు తెలిపారు.
''అవకతవకల కారణంగా తణుకులో టీడీఆర్ బాండ్ల జారీని నిలుపుదల చేశాం. తణుకు, గుంటూరు, తిరుపతిలో గతంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోంది. బాండ్ల జారీకి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో 822 టీడీఆర్‌లు పెండింగ్‌లో ఉండగా.. కొత్తగా 521 దరఖాస్తులు వచ్చాయి. అధికంగా విశాఖలో వచ్చాయి. అమరావతిలోనూ టీడీఆర్ బాండ్లు జారీ చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా రియల్ ఎస్టేట్ రంగం ఇబ్బంది పడకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. చట్ట ప్రకారమే అన్నీ అమలు చేస్తాం. రేరాలో అనుమతులు ఇకపై ఆన్‌లైన్‌లో జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం'' అని మంత్రి వెల్లడించారు.





# టెస్టుల్లో '2 టైర్' విధానం..

## ఆ దిశగా ఐసీసీ ఛైర్మన్ జై షా అడుగులు!

**లండన్:** ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన టెస్టు సిరీస్‌కు విపరీతమైన ప్రేక్షకాదరణ లభించింది. మెల్‌బోర్న్, సిడ్నీల్లో రికార్డు స్థాయిలో ఆటను మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చారు. ఈ క్రమంలోనే భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి టెస్టుల్లో 'రెండంచెల' విధానం తీసుకురావాలని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అత్యుత్తమ జట్లు తరచూ తలపడుతూ ఉండాలని.. అప్పుడు టెస్టులకు మరింత ఆదరణ దక్కడం ఖాయమని రవిశాస్త్రి వెల్లడించాడు. ఇప్పుడు ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షా కూడా ఈ విధానంపై ఆసక్తిగా ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ బోర్డులతో జైషా సమావేశం నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌గా ఇప్పుడున్న విధానంపై మాజీ క్రికెటర్లు పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దేశాలు తక్కువ మ్యాచ్‌లు ఆడినా ఫైనల్‌కు వస్తున్నాయని.. అన్ని టీమ్‌లకు సమానంగా టెస్టులను నిర్వహించాలని సూచిస్తున్నారు.

**ఏంటీ 2-టైర్ విధానం..**

టూ-టైర్ విధానంలో ప్రదర్శనాపరంగా అత్యుత్తమ జట్లు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్ తరచూ ఎక్కువ టెస్టులను ఆడాలి. ఇప్పుడు సంవత్సరానికి ఒక్కోసారి మాత్రమే తమ దేశాల్లో ప్రత్యర్థులతో తలపడుతున్నాయి. అలా కాకుండా తొలి దశలో ఈ ఆరేడు టీమ్‌లు ఒకదానితో మరొకటి ఎక్కువ మ్యాచ్‌లను ఆడతాయి. ఇక రెండో టైర్‌లో మిగిలిన టీమ్‌లు బంగ్లాదేశ్, వెస్టిండీస్, జింబాబ్వే, ఐర్లాండ్ వంటి టీమ్‌లు తమలో తాము తలపడాలి. ఇక్కడ అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఒకటి లేదా రెండు జట్లకు మాత్రమే టైర్ -1 విభాగంలో చోటు కల్పించే అవకాశం ఉంది.

**ఇక మా మ్యాచ్‌లు ఎవరు చూస్తారు?..**

అయితే, టెస్టుల్లో టూ టైర్ విధానంపై 2016లోనే చిన్న జట్ల బోర్డుల నుంచి విముఖత వ్యక్తమైంది. ఇలా చేస్తే తమ క్రికెట్‌కు ఆదరణ తగ్గిపోతుందని.. పెద్ద జట్లతో ఆడినప్పుడే ప్రేక్షకులు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారనేది ఆయా బోర్డుల వాదన. అప్పుడు బీసీసీఐ (BCCI) అధ్యక్షుడిగా ఉన్న అనురాగ్ ఠాకూర్ కూడా ఈ విధానాన్ని వ్యతిరేకించారు. ''చిన్న దేశాల క్రికెట్‌ను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆర్థికంగానూ వారికి చాలా నష్టం కలుగుతుంది. ఆయా జట్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందనేది బీసీసీఐ అభిప్రాయం. అందుకే, ఈ విధానంపై నిర్ణయం తీసుకొనే ముందు చిన్న జట్లను సంప్రదించాలి. వారికి నష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత ఐసీసీపై ఉంది'' అని ఠాకూర్ వెల్లడించారు. ఇప్పుడు ఐసీసీ ఛైర్మన్‌గా జైషా రావడంతో బీసీసీఐ ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవచ్చని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### రాహుల్ ద్రావిడ్ కోచ్‌గా ఉన్నప్పుడు అంతా బాగుంది..

# ఇప్పుడేమైంది?

**హర్భజన్ సింగ్**



**ముంబయి:** కొన్ని నెలలుగా వన్డేలు, టెస్టుల్లో టీమ్‌ఇండియా ప్రదర్శన చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. ముఖ్యంగా టెస్టుల్లో పేలవ ఆటతీరుతో వరుస ఓటములు చవిచూస్తోంది. స్వదేశంలో కివీస్ చేతిలో వైట్‌వాష్.. తాజాగా బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను టీమ్‌ఇండియా 1-3తో కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత జట్టు ఆటతీరు గురించి మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఘాటుగా స్పందించాడు. రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా ఉన్నంత వరకు అంతా బాగుందని, ఈ ఆరు నెలల్లో ఏమైంది? అని ప్రశ్నించాడు. టీమ్‌ఇండియా సూపర్‌స్టార్ సంస్కృతిని వీడాలని సూచించాడు.

'రాహుల్ ద్రవిడ్ టీమ్‌ఇండియా కోచ్‌గా ఉన్నంత కాలం అంతా బాగుంది. స్వదేశంలో ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్ సాధించాం. తర్వాత భారత జట్టు టీ20 ప్రపంచ కప్ కూడా గెలిచింది. కానీ, ఆ తర్వాత సడెన్‌గా ఏమైంది? నాకైతే ఏమీ అర్థం కావడం లేదు. గడిచిన ఆరు నెలల్లో శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ కోల్పోయాం. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో వైట్ వాష్ అయ్యాం. ఇప్పుడు ఆస్ట్రేలియాలో 3-1తో ఓడిపోయాం. అంతా పతనమైనట్లు కనిపిస్తోంది' అని హర్భజన్ అన్నాడు. ద్రవిడ్ తర్వాత గౌతమ్ గంభీర్ కోచ్‌గా నియమితుడైన సంగతి తెలిసిందే.

**ఆట కంటే ఏదీ ముఖ్యం కాదు..**

ఆసీస్ పర్యటనలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తీవ్ర నిరాశపర్చారు. దీంతో వారిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై భజ్జీ స్పందిస్తూ.. 'ప్రతి ఆటగాడికి ఎంతో కొంత పాపులారిటీ, పేరుప్రఖ్యాతలు ఉంటాయి. అయితే, ఆట కంటే ఏదీ ముఖ్యం కాదు. కపిల్‌దేవ్, అనిల్ కుంబ్లే లాంటి పెద్ద పెద్ద మ్యాచ్ విన్నర్లను కూడా జట్టు నుంచి తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని అప్పట్లోనే బీసీసీఐ, సెలక్టర్లు చెప్పారు. టీమ్‌ఇండియా సూపర్‌స్టార్ సంస్కృతిని వదిలిపెట్టాలి. అభిమన్యు ఈశ్వరన్‌ను ఆస్ట్రేలియా టూర్‌కు ఎంపిక చేసి ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించలేదు. సర్ఫరాజ్ ఖాన్ పరిస్థితి ఇదే. పేరున్న ఆటగాళ్లని కాకుండా బాగా ఆడే ప్లేయర్లనే ఎంపిక చేయాలి' అని హర్భజన్ సూచించాడు.

**బుమ్రా లేకపోతే..**

ఆస్ట్రేలియా టూర్‌లో భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అదరగొట్టిన సంగతి తెలిసిందే. అతను 5 మ్యాచ్‌ల్లో 32 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో బుమ్రాపై హర్భజన్. ప్రశంసలు కురిపించాడు. బుమ్రా లేకుంటే సిరీస్‌ను భారత్ 0-5తో కోల్పోయేదని పేర్కొన్నాడు. అతను పెర్త్ టెస్టులో భారత్‌ను కాపాడాడు. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు కీలకంగా మారాడు. అతను లేకపోతే ఈ సిరీస్‌లో టీమ్‌ఇండియా 0-5, 0-4తో ఓటమిపాలయ్యేది' అని భజ్జీ అభిప్రాయపడ్డాడు.



### ఐర్లాండ్‌తో వన్డే సిరీస్..

# హర్మన్‌కు రెస్ట్..

**భారత కెప్టెన్‌గా స్మృతి మంధాన**

**ముంబయి:** స్వదేశంలో ఐర్లాండ్‌తో భారత మహిళా జట్టు మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా మైదానం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈక్రమంలో మహిళా జట్టు సెలక్షన్ కమిటీ స్క్వాడ్‌ను ప్రకటించింది. రెగ్యులర్ సారథి హర్మన్ ప్రీత్ కౌర్, ఫాస్ట్ బౌలర్ రేణుకాసింగ్‌కు మేనేజ్‌మెంట్ విశ్రాంతి ఇచ్చింది. దీంతో జట్టు పగ్గాలను స్మృతి మంధానకు అప్పగించింది. దీప్తి శర్మను వైస్ కెప్టెన్‌గా నియమించింది. 15 మందితో కూడిన స్క్వాడ్‌ను సెలక్షన్ కమిటీ వెల్లడించింది. ఐర్లాండ్ ఇప్పటికే తన జట్టును ప్రకటించింది.

**స్క్వాడ్‌లు ఇవే..**

**భారత్:** స్మృతి మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, ఉమా ఛెత్రీ (వికెట్ కీపర్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, రాఘ్వి బిస్త్, ప్రియా మిశ్రా, తనుజా కాన్వెర్, టిటాస్ సధు, సైమా ఠాకూర్, సయాలి సత్ఘరె

**ఐర్లాండ్:** గాబీ లూయిస్ (కెప్టెన్), అవా కానింగ్, క్రిస్టినా కౌల్టర్ రీల్లే, అలానా డాల్జెల్, జార్జినా డెంప్సే, సారా ఫోర్బ్స్, జొన్నా లాగ్హరన్, ఏమీ మగైరె, లీహ్ పాల్, ఓర్లా ప్రెండరెగస్ట్, ఉనా రేమండ్, ఫ్రెయా సర్గెట్, రెబెక్కా స్టాకెల్

**ఎప్పుడంటే?..**

**తొలి వన్డే:** జనవరి 10, ఉదయం 11 గంటలకు, రెండో వన్డే: జనవరి 12, ఉదయం 11 గంటలకు, మూడో వన్డే: జనవరి 15, ఉదయం 11 గంటలకు.

# ఇక సెలక్టర్లే నిర్ణయించాలి

**సీనియర్ల టెస్టు భవితవ్యంపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా**



**ముంబయి:** భారత జట్టు టెస్టు క్రికెట్ ఆడేందుకు దాదాపు ఐదు నెలల సమయం ఉంది. ఇక జూన్‌లోనే ఇంగ్లండ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో తలపడనుంది. అప్పటిలోగా వన్డేలు, టీ20లను ఆడనుంది. అయితే, ఇప్పుడు అందరి దృష్టి ఇద్దరు సీనియర్ క్రికెటర్ల పైనే ఉంది. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అత్యంత దారుణమైన ప్రదర్శనతో నిరాశపరిచారు. ఒక దశలో వీరిద్దరూ టెస్టులకు వీడ్కోలు చెబుతారని అంతా భావించారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. ఆలోగా వీరిద్దరి టెస్టు భవితవ్యంపై ఓ నిర్ణయం తీసుకోవాలని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా సూచించాడు.

''గత ఐదేళ్లుగా సీనియర్ల గణాంకాలను చూస్తే.. ఎవరూ ప్రత్యేకంగా టార్గెట్ చేయాల్సిన అవసరం లేదు. స్వదేశంలోనైనా, విదేశంలోనైనా ఆటతీరు అత్యంత దారుణంగా ఉంది. ఆసీస్‌తో ఐదో టెస్టు మ్యాచ్ అనంతరం ఇర్ఫాన్ పఠాన్ కూడా కోహ్లీ చేసిన పరుగుల గురించి కామెంట్ చేశాడు. కనీసం కుర్రాళ్లు ఆడినవిధంగానూ విరాట్ పరుగులు చేయలేకపోయాడు. అతడు 25 సగటుతోనే ఆడాడు. ఇక్కడ మనం ఏం చేయలేం. ఇక అంతా సెలక్టర్లే చూసుకోవాలి. ఎందుకంటే అదే వారి బాధ్యత. రానున్న డబ్ల్యూటీసీ సీజన్‌కు వెళ్లేందుకు ఐదు నెలల సమయం ఉంది. అప్పుడు కూడా అర్హత సాధించడంలో విఫలమై.. రోహిత్ - విరాట్ పరుగులు చేయకపోతే జట్టు పరిస్థితి దారుణంగా తయారవుతుంది. అందుకే ఇప్పుడు బంతి సెలెక్టర్ల కోర్టులోనే ఉంది. ఏ నిర్ణయమైనా వారే తీసుకోవాలి'' అని వెల్లడించాడు.

**ఇదీ కోహ్లీ ప్రదర్శన..**

''విరాట్ కోహ్లీ 2020వ సంవత్సరంలో కేవలం మూడు టెస్టులే ఆడాడు. 116 పరుగులు చేశాడు. అందులో 74 పరుగులు అత్యధికం. సగటు కేవలం 19.33 మాత్రమే. కేవలం మూడే మ్యాచ్‌లు కావడంతో పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. కొవిడ్ వల్ల ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు. కానీ, 2021లో 11 టెస్టులు ఆడాడు. అందులో 536 పరుగులు చేసినా ఒక్క సెంచరీ కూడా లేదు. అతడి యావరేజ్ కూడా 28 మాత్రమే. అతడి కోణంలో చూస్తే అత్యంత నిరాశపరిచిన ఏడాది అది. అదే సమయంలో మరో క్రికెటర్ నుంచి ఆలోచిస్తే.. జట్టు నుంచి తప్పించడం ఖాయం. కానీ, అతడు అప్పటి నుంచి ఆడుతూనే ఉన్నాడు. 2022లో ఆరు మ్యాచుల్లో 265 పరుగులు చేయగా.. 2023వ ఏడాది బాగా కలిసొచ్చింది. కోహ్లీ 8 టెస్టుల్లో 671 పరుగులు చేశాడు. సగటు కూడా 55 ఉంది. ఇక విరాట్ మళ్లీ అదరగొట్టేయడం ఖాయమని అంతా భావించారు. కానీ, 2024లో మాత్రం 10 టెస్టుల్లో కేవలం 417 పరుగులు మాత్రమే చేశాడు. అదీనూ ఒక్క సెంచరీతో 24.5 సగటుతో ఆడాడు. పదిసార్లు సింగిల్ డిజిట్‌కే ఔట్ కావడం అభిమానులను నిరాశకు గురి చేసే అంశం'' అని చోప్రా వ్యాఖ్యానించాడు.

## ₹10 వేలకే 50 ఎంపీ కెమెరాతో రెడ్‌మీ 14C 5జీ స్మార్ట్‌ఫోన్

**ముంబయి:** ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ షావోమికి చెందిన సబ్‌బ్రాండ్ రెడ్‌మీ మరో బడ్జెట్ ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. 14సి పేరిట తక్కువ ధరలో 5జీ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. 50 ఎంపీ కెమెరాతో రూ.10వేల్లోపే ఈ స్మార్ట్‌ఫోన్‌ను రెడ్‌మీ తీసుకురావడం విశేషం. ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+64జీబీ వేరియంట్ ధర రూ.9,999గా కంపెనీ నిర్ణయించింది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.10,999, 6జీబీ+128 జీబీ వేరియంట్ ధర రూ.11,999గా కంపెనీ పేర్కొంది. స్టార్‌లైట్ బ్లూ, స్టార్‌డస్ట్ పర్పుల్, స్ట్రాంగేజ్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. జనవరి 10 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఎంఐ.కామ్, షావోమి రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్‌ను విక్రయించనున్నారు.ఇక స్పెసిఫికేషన్ల విషయానికొస్తే.. ఆండ్రాయిడ్ 14తో కూడిన హైపర్‌ఓఎస్‌తో ఈ ఫోన్ వస్తోంది. 6.88 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేటుతో పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 4 జనరేషన్ 2 ప్రాసెసర్ అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ కెమెరా ఇచ్చారు. ముందువైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్ ఉన్నాయి. ఈ ఫోన్‌లో 5,160 ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చారు. ఇది 18W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 33W ఛార్జర్‌ను బాక్స్‌తో పాటు ఇస్తున్నారు. సింగిల్ ఛార్జ్‌తో ఈ ఫోన్‌ను స్టాండ్‌బైలో 21 రోజులు, 139 గంటల పాటు మ్యూజిక్‌ను ప్లే చేయొచ్చని కంపెనీ చెబుతోంది.

### ముంచిన వైరస్ భయాలు..

# రూ.₹12 లక్షల కోట్లు ఆవిరి!




**ముంబయి:** దలాల్ స్ట్రీట్‌లో మరోసారి వైరస్ గుబులు మొదలైంది. దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగు చూసిన వేళ సూచీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలను పడేశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర పతనం అవ్వగా.. నిఫ్టీ 23,550 స్థాయికి చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించి రూ.439 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,281.65 (క్రితం ముగింపు 79,223.11) పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభనష్టాల మధ్య చలించింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో హెచ్‌ఎంపీవీని గుర్తించినట్లు వార్తలు రావడంతో సూచీల పతనం ప్రారంభమైంది. అనంతరం భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 77,781.62 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1258.12 పాయింట్ల నష్టంతో 77,964.99 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, సన్‌ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.30 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2645 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**కారణాలు ఇవే..**

చైనాలో వెలుగుచూసిన హ్యూమన్ మెటానిమో వైరస్ కేసులు భారత్‌లోనూ నమోదుకావడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం ఫ్లాట్‌గా సూచీలు ప్రారంభం కాగా.. బెంగళూరులో 2, గుజరాత్‌లో ఒక కేసు నమోదైనట్లు వార్తలు రావడం కలకలం రేపింది. ఈ వార్తలు ప్రధానంగా సూచీలను పడేశాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. మరికొన్ని రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో చైనా సహా మరికొన్ని దేశాలపై టారిఫ్‌ల భయం వెంటాడుతోంది. దీంతో జపాన్ నిక్కీ, హాంకాంగ్, షాంఘై మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, టాటా స్టీల్ వంటి అధిక వెయిటేజీ ఉన్న స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమయ్యాయి.దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్‌ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం మన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు.

### బుమ్రానే అత్యంత క్లిష్టమైన బౌలర్

# మాకు పీడకల మిగిల్చేవాడే: ఖవాజా



**సిడ్నీ:** ఐదు టెస్టుల బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 32 వికెట్లు తీశాడు. అయితే, సిడ్నీ టెస్టు వేదికగా ఆఖరి మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం బౌలింగ్ చేయలేదు. వెన్ను నొప్పి కారణంగా బుమ్రా డగౌట్‌కే పరిమితమయ్యాడు. దీంతో భారత్ నిర్దేశించిన 162 పరుగుల టార్గెట్‌కు ఆసీస్ 4 వికెట్లను కోల్పోయింది. ప్రసిధ్ కృష్ణ 3, సిరాజ్ ఒక వికెట్ తీశారు. బుమ్రా లేకపోవడంతో ఆస్ట్రేలియా బ్యాటర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. మొదటి నాలుగు టెస్టుల్లో ఇబ్బందిపడిన ఉస్మాన్ ఖవాజా కూడా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేశాడు. బుమ్రా బౌలింగ్ చేయడం లేదని తెలిసి తమ జట్టు సంతోషపడిందని ఇప్పటికే ట్రావిస్ హెడ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఖవాజా కూడా బుమ్రా ఉండుంటే తమకు పీడకల మిగిల్చేవాడేనని వ్యాఖ్యానించాడు.

''నేను ఈ సిరీస్‌లో ఒక్కసారి మినహా బుమ్రా బౌలింగ్‌లోనే ఔటయ్యా. అదెంతో సిగ్గుగా అనిపించింది. అయితే, కీలకమైన ఐదో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్‌కు రాలేదు. అందుకు దేవుడికి ధన్యవాదాలు చెబుతాం. ఒకవేళ అతడు బౌలింగ్‌కు వచ్చి ఉంటే మాకు పీడకలే మిగిల్చేవాడు. సిడ్నీ పిచ్ మీద బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం అత్యంత ప్రమాదకరం. అతడు మైదానంలో లేకపోవడంతో.. 'హమ్మయ్య.. మనకు అవకాశాలు ఉన్నాయి' అని అనుకున్నాం. నేను ఇప్పటివరకు ఎదుర్కొన్న బౌలర్లలో బుమ్రానే అత్యంత కఠినమైన పేసర్'' అని ఖవాజా వెల్లడించాడు.

**తొమ్మిదిసార్లు అతడికే వికెట్..**

జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌కు వచ్చాడంటే ఎంతటి బ్యాటర్‌కైనా వణుకు పుట్టాల్సిందే. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టుల్లో ఉస్మాన్ ఖవాజా 10 ఇన్నింగ్స్‌లు ఆడాడు. అందులో తొమ్మిదిసార్లు బుమ్రా బౌలింగ్‌లోనే ఔట్ కావడం గమనార్హం. ఆ పదోసారి కూడా బుమ్రా బౌలింగ్ చేయకపోవడంతోనే.. సిరాజ్‌కు దొరికిపోయాడు. ఈ సిరీస్‌లో ఖవాజా 20.44 సగటుతో 184 పరుగులు మాత్రమే చేశాడు.

**ఇంగ్లండ్‌తో సిరీస్.. బుమ్రాకు విశ్రాంతి?**

ఇంగ్లండ్‌తో స్వదేశంలో భారత్ వన్డే, టీ20 సిరీస్‌ను ఆడనుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ ఆడే వన్డే సిరీస్ అదే. వెన్ను నొప్పితో బాధపడుతున్న బుమ్రాకు విశ్రాంతి ఇచ్చేయోచనలో మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, అతడి గాయం తీవ్రతపై బీసీసీఐ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# నేడు నిర్మాత బీఏ రాజు 65వ జయంతి



తెలుగు సినీ పరిశ్రమలో 40 ఏళ్ళ పాటు నెంబర్ వన్ స్థానంలో సినీ జర్నలిస్టుగా, పీఆర్ఓగా, సినీ వార పత్రిక, వెబ్సైట్ అధినేతగా, నిర్మాతగా అందరికీ తలలో నాలుకగా వ్యవహరించిన బీఏ రాజు (జనవరి 7న) 65వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

సూపర్ స్టార్ కృష్ణ వద్ద పబ్లిసిటీ వ్యవహారాలను చూసే పీఆర్ఓగా సినీ కేరీర్‌ని ఆరంభించిన బీఏరాజు ఆ తరువాత ఆయన ప్రోత్సహంతోనే సినీ పాత్రికేయుడిగా రాణించారు. ఆంధ్రజ్యోతి, జ్యోతి చిత్ర, ఉదయం, శివరంజని, వంటి దిన, వార పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేసి అనంతరం తన సతీమణి బీ జయ సహచర్యంతో 1994 లో సూపర్ హిట్ వార పత్రిక స్థాపించి, తెలుగు సినీ వార్తాపత్రికలలో సంచలనం సృష్టించారు. ఆయన మరణం వరకు ఒక్క సంచిక మిస్సవకుండా 27 సంవత్సరాలపాటు పత్రికను దిగ్విజయంగా నిర్వహించారు అంటే ఆయన అఖుంటిత దీక్ష ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

కేవలం సినీ జర్నలిస్టుగానే కాకుండా అగ్ర దర్శకులకు, హీరోలకు, హీరోయిన్లకు గైడ్ లైన్స్ ఇస్తూ వారి సినీ కెరీర్‌కి మార్గదర్శకుడిగా నిలిచారు రాజు. సుమారు 1500 చిత్రాలకు పైగా పబ్లిసిటీ ఇంఛార్జిగా పని చేసిన బిఏ రాజు ఆయా చిత్రాల విజయాలకు దోహదపడ్డారు. చిత్ర పరిశ్రమలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పర్చుకుని అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు బీఏ రాజు. తెలుగు సినీ రంగం హైదరాబాద్ బదిలీ కావడంతో 2001లో సూపర్ హిట్ అడ్మిస్ట్రేషన్ ఆఫీస్ కూడా హైదరాబాద్ కు షిఫ్ట్ చేశారు. ఆ ఏడాదే అయన నిర్మాతగా, ఆయన భార్య బి జయ దర్శకురాలిగా 'ప్రేమలో పావని కళ్యాణ్' అనే చిత్రంతో ఆర్జే సినిమాస్ బ్యానర్ మీద నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. చంటిగాడు, ప్రేమికులు, గుండమ్మ గారి మనవడు, సవాల్, లవ్లీ, వైశాఖం వంటి విజయవంతమైన చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించారు. రాజు గారు ప్రారంభించిన ఇండస్ట్రీ హిట్ వెబ్ సైట్ ద్వారా, దాదాపు 7 లక్షల మంది ఫాలోవర్స్ కలిగిన ఎంతో పాపులర్ అయిన ఆయన (ట్విట్టర్) ఎక్స్ అకౌంట్ ద్వారా పరిశ్రమకు సంబంధించిన వార్తా విశేషాలు ఎప్పటికప్పుడు ఆయన బృందం, BA Raju's Team ద్వారా అందిస్తున్నారు. ఆర్ జే సినిమాస్ ద్వారా ఆయన తనయుడు శివకుమార్ బి కూడా నిర్మాతగా త్వరలో ప్రముఖ హీరోలతో చిత్రాలను ప్రకటించనున్నారు.

చిత్ర పరిశ్రమ ప్రముఖులందరితో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ... ముఖ్యంగా ఎవర్ గ్రీన్ సూపర్ స్టార్ కృష్ణ, సూపర్ స్టార్ మహేష్ బాబులతో రాజుకి మంచి అనుబంధం ఉండేది. అలాగే ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కూడా ఆయన పనిచేశారు. సినీ పాత్రికేయులకు ఏ కష్టం వచ్చినా నేనున్నాని, ఆర్థిక, హార్థిక భరోసా ఇచ్చేవారు. ఏ దర్శకుడు ఏ హీరోతో ఎన్ని సినిమాలు నిర్మించాడో? బ్యానర్ పేరు, విడుదల తేదీ ఆ మూవీ ఎన్ని రోజు ఈ సెంటర్లలో ఆడిందో వంటి వివరాలను తడుముకోకుండా హ్యూమన్ టాలీవుడ్ ఎన్సైక్లోపీడియాలా టక్కున చెప్పేవారు. అంతటి సినిమా పరిజ్ఞానాన్ని సొంతం చేసుకున్నారు రాజు గారు. 24 గంటలు సినిమా గురించే ఆలోచించే బి.ఏ.రాజు దూరమై ఏళ్లు గడుస్తున్నా ఆయన అందిస్తున్న సేవలు అజరామరం. ఏ లోకాన వున్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని 65వ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాం.



# పార్వతి దేవిగా కాజల్

మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి మరో అప్‌డేట్ వచ్చింది. ఇందులో హీరోయిన్ కాజల్ అగర్వాల్ పార్వతీ దేవిగా కనిపించనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.

"ముల్లోకాలు ఏలే తల్లి! భక్తులను ఆదుకునే త్రిశక్తి! శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీజ్ఞాన ప్రసూనాంబిక! పార్వతి దేవి" అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. ఆమె అత్యద్భుతమైన అందం, దైవిక ఉనికికి సాక్ష్యమివ్వండి. ఆమె భక్తి మరియు త్యాగం ఈ పురాణ గాథలో జీవం పోసింది అని చిత్రం యూనిట్ పేర్కొంది. పార్వతి దేవి పాత్రలో కాజల్ అగర్వాల్ తెల్ల చీరలో చిరు నవ్వులు చిందిస్తూ ఆశీస్సులు అందిస్తున్నట్లు ఉన్న కాజల్ పార్వతిదేవి లుక్ సినిమాపై మరింతగా ఆసక్తిని పెంచింది.

కాగా, ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీలోని పలు కీలక పాత్రల తాలూకు పోస్టర్లను చిత్రం యూనిట్ విడుదల చేసింది. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది.

ఇప్పటి వరకు మంచు విష్ణు, మోహన్ బాబు, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్ ఇతర నటీనటుల లుక్స్ రివీల్ చేశారు. తర్వాత రాబోతున్న పోస్టర్ ప్రభాస్ పాత్ర అయ్యి ఉంటుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాలో ప్రభాస్ కీలకమైన గెస్ట్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఆ మధ్య సినిమాలోని ప్రభాస్ లుక్ లీక్ అయ్యింది. వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా సోషల్ మీడియా నుంచి వెంటనే తొలగించారు. లీక్ అయ్యింది కనుక వెంటనే అధికారికంగా ప్రభాస్ లుక్‌ను విడుదల చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ప్రభాస్ లుక్‌ను విష్ణు రివీల్ చేయకుండా సస్పెన్స్‌గా ఉంచుతూ వస్తున్నారు. కన్నప్ప సినిమాలో ప్రభాస్ కనిపించేది కొన్ని నిమిషాలు అయినా కచ్చితంగా ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే కన్నప్ప సినిమా షూటింగ్‌ను పూర్తి చేసిన మంచు విష్ణు దేశ విదేశాల్లో ప్రముఖ వీఎఫ్ఎక్స్ కంపెనీల్లో వీఎఫ్ఎక్స్ వర్క్ చేయిస్తున్నారు. సినిమాకు వీఎఫ్ఎక్స్ అత్యంత కీలకం. అందుకే సినిమా గత ఏడాది డిసెంబర్‌లోనే విడుదల కావాల్సి ఉన్నా వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కానందున వాయిదా వేశారు. ఏప్రిల్‌లో కచ్చితంగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు మంచు విష్ణు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సినిమాలో మంచు విష్ణు పిల్లలు నలుగురు కనిపించబోతున్నారు. మొత్తానికి ఈ సినిమాపై విష్ణు చాలా ఆశలు పెట్టుకున్నారు. మరి అంచనాలను అందుకునే విధంగా కన్నప్ప ఉంటుందా అనేది చూడాలంటే ఏప్రిల్ 25 వరకు వెయిట్ చేయాల్సిందే.



# ఏప్రిల్ 10న గుడ్ బ్యాడ్ అగ్లీ

ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్, కోలీవుడ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ తో వారి అప్ కమింగ్ మల్టీ లింగ్వల్ వెంచర్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హైప్రొఫైల్ ప్రాజెక్ట్ ఇప్పటికే పోస్టర్‌లతో అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మైత్రీ మూవీ మేకర్స్ తమిళ చిత్రసీమలోకి ప్రవేశిస్తున్నందున, ఈ స్టార్‌స్టడెడ్ ప్రాజెక్ట్ కోసం అంచనాలు భారీగా ఉన్నాయి. ఇది గ్రిప్పింగ్ యాక్షన్, ఆకట్టుకునే డ్రామా బ్లెండ్ గా వుంటుంది. అజిత్ ని క్రేజీ అవతార్‌లో చూడటానికి అభిమానులు ఎదురుచూస్తున్నారు.

సోమవారం మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 10, 2025న విడుదలవుతున్న ఈ చిత్రం వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా నిలిచింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో, అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అదరగొట్టారు. చేతిలో తుపాకీతో సోఫాలో కూర్చున్న అతను, ఇంటెన్సిటీ , సస్పెన్స్‌తో కూడిన పెర్ఫార్మెన్స్ అందిస్తానని హామీ ఇచ్చారు.

మార్క్ ఆంటోని విజయం తర్వాత, స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌లను రూపొందించడంలో నైపుణ్యం కలిగిన దర్శకుడు అధిక్ రవిచంద్రన్, అజిత్ కుమార్‌ను మల్టీ లేయర్డ్ పాత్రలో చూపించబోతున్నారు.

ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ ఫీమేల్ లీడ్ గా నటిస్తున్నారు. ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్ సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ సౌండ్‌ట్రాక్ అందించగా, అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. ఎడిటింగ్‌ను విజయ్ వేలుకుట్టి నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను జి ఎం శేఖర్ పర్యవేక్షిస్తున్నారు.



# 4 రోజుల్లో రూ.23.20 కోట్లు వసూలు చేసిన ఐడెంటిటీ

కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.23.20 కోట్ల కలెక్షన్లు రాబట్టిన "ఐడెంటిటీ" చిత్రం మలయాళ చిత్ర పరిశ్రమలో కొత్త అంచనాలను నెలకొల్పింది. 2024 సంవత్సరం మలయాళ సినిమాకి ఒక మైలురాయిగా నిలిచింది. అనేక సినిమాలు బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లు మరియు ₹100 కోట్ల మార్కులను దాటాయి. మంజుమ్మల్ బాయ్స్, ఏఆర్ఎం, ఆవేశం, కిష్కింద కాండమ్, గురువాయూర్ అంబలనాడాయిల్, వాజా, ఆడు జీవితం, అన్వేషిప్పిన్ కందెతుమ్, ఓస్లర్, భ్రమయుగం, వజ్హంగళ్ శేషం, ప్రేమలు మరియు అనేక ఇతర సినిమాలు బాక్సాఫీస్ వద్ద గణనీయమైన ప్రభావం చూపాయి.

"మార్కో" విడుదలతో బాక్సాఫీస్ హంగామా తారాస్థాయికి చేరుకుంది. మంజుమ్మెల్ బాయ్స్, ఏఆర్ఎం, ఆవేశం ప్రేమలు వంటి సినిమాలు ఇతర రాష్ట్రాలలో మలయాళ సినిమాకి కొత్త మార్గాలను తెరిచాయి, "మార్కో" అద్భుతమైన విజయాన్ని అందించడానికి మార్గం సుగమం చేశాయి.

2025 ఎలా ఉంటుందో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, "ఐడెంటిటీ" థియేటర్లలోకి వచ్చింది, కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.23.20 కోట్ల భారీ వసూళ్లను అందించింది. ఈ చిత్రం దాని తమిళ వెర్షన్‌లో కూడా హిట్ స్టేటస్‌ను సాధించింది, 2025 బాక్స్ ఆఫీస్ లైనప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.

"ఐడెంటిటీ" అనేది రాబోయే సంవత్సరానికి థియేటర్లు సిద్ధంగా ఉన్నాయని స్పష్టమైన సూచికగా పనిచేస్తుంది. ఈ వరుస బాక్సాఫీస్ విజయాలు ఎక్కువ మంది ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అదనంగా, మల్టీప్లెక్స్ ప్రేక్షకులు, సినిమా టిక్కెట్ల కంటే తరచుగా స్నాక్స్ మరియు రిఫ్రెష్‌మెంట్ల కోసం ఎక్కువ ఖర్చు చేస్తారు, ఒక సినిమా విజయం వినోద పరిశ్రమ యొక్క ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడుతుందో ప్రదర్శిస్తారు.

అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. రాజు మల్లియత్, డా. సి.జె రాయ్ నిర్మించారు. డ్రీమ్ బిగ్ ఫిల్మ్స్ ద్వారా గోకులం మూవీస్ పంపిణీ చేసారు.

## అఘతియా ఫస్ట్ సింగిల్

# గాలి ఊయలలో

## విడుదల



ఫాంటసీ-హారర్-థ్రిల్లర్ విజువల్ మాస్టర్ పీస్ అగాతియా ఫస్ట్ సింగిల్ గాలి ఊయలలో రిలీజ్ చేశారు మేకర్స్. ఇది సంగీత, సినీ ప్రేమికులకు మరపురాని అనుభూతిని కలిగిస్తుంది. మాస్ట్రో యువన్ శంకర్ రాజా స్వరపరిచిన ఈ ట్రాక్ అద్భుతమైన విజువల్స్‌తో పాటు 2025లో బిగ్గెస్ట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని వాగ్దానం చేసే మెలోడీలను బ్లెండ్ చేసింది.

గాలి ఊయలల్లో మిస్టరీ, ఎమోషన్స్ ఎసెన్స్ ని అందిస్తోంది. ఇళయరాజా సిగ్నేచర్ పియానో పీస్‌తో ప్రారంభమైన ఈ పాట, మరుపురాని అనుభూతిని అందిస్తూ, ఒక సోల్ ఫుల్ మెలోడీగా అలరిస్తోంది. యువన్ శంకర్ రాజా, మెలోడీలలో మాస్టర్, శ్రోతలను లోతుగా ఆకట్టుకునే పాటని రూపొందించారు. శ్రీధర్ మాస్టర్ కొరియోగ్రఫీ, దీపక్ కుమార్ పాడి అందించిన ఉత్కంఠభరితమైన సినిమాటోగ్రఫీ ఈ పాటను విజువల్ ట్రీట్‌గా నిలిపాయి.

దర్శకుడు, పాటల రచయిత పా.విజయ్ మాట్లాడుతూ.. "ఈ పాట కేవలం మెలోడీ కాదు-ఇది ఒక ప్రయాణం. ఇది ఇళయరాజామ బీథోవెన్‌ల ప్రతిభను కలిగి ఉండాలని నేను కోరుకున్నాను. నేను ఈ ఐడియాను యువన్‌కి అందించగా, అతను కేవలం 10 నిమిషాల్లో మ్యాజిక్ సృష్టించాడు. ఇది టైమ్‌లెస్ ట్యూన్‌లు, మోడ్రన్ సెన్సిబిలిటీల సమ్మేళనం'అన్నారు.

యువన్ శంకర్ రాజా తన అనుభవం గురించి చెబుతూ.. "పా.విజయ్‌తో కలిసి పనిచేయడం ఎప్పుడూ ప్రత్యేకమే. మేము కలిసి 300 పాటలకు పైగా పని చేసాము. గాలి ఊయలలో మా నాన్నగారి పియానో పీస్ , బీథోవెన్ ట్యూన్‌ను చేర్చడం గురించి అతను చెప్పినప్పుడు, నేను థ్రిల్ అయ్యాను. ఇది నా అత్యుత్తమ మెలోడీలలో ఒకటి అని నేను నిజంగా నమ్ముతున్నాను.'అన్నారు.

ఈ పాన్ ఇండియా మూవీ జనవరి 31, 2025న తమిళం, తెలుగు, హిందీలో గ్రాండ్ గా విడుదల కానుంది.

# ఘనంగా కళావేదిక ఫిల్మ్ మ్యూజిక్ అవార్డ్స్ ఫంక్షన్

కళావేదిక అవార్డ్స్ 59వ వార్షికోత్సవం సందర్భంగా బస్సా శ్రీనివాస్ గుప్త, భువన గారి ఆధ్వర్యంలో గీతరచయితలకు, గాయనీగాయకులకు, సంగీతదర్శకులకు అవార్డులు అందించారు. ఆర్.వి రమణమూర్తి ఎటువంటి ఆశయాల మేరకు కళావేదికను స్థాపించారో ఆ ఆశయాలను ఆయన కుమార్తె భువన సఫలం చేస్తూ ఈ అవార్డుల కార్యక్రమం నిదర్శనంగా చెప్పవచ్చు. జనవరి 4వ తేదీన హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్ లో జరిగిన ఈ కార్యక్రమానికి వాసవి గ్రూప్స్, ఉప్పల ఫౌండేషన్, మనెపల్లి జ్యువలరీ శ్రీ చరణ, కమ్యూనికేషన్ సదరన్ ట్రావెల్స్ పార్టీలు స్పాన్సర్లు సహాయక సహకారాలతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త, దర్శకులూ ముప్పలనేని శివ, ఇంద్రగంటి మోహన్ కృష్ణ, సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్, ఎమ్ ఎమ్ శ్రీలేఖ, సింగర్ కౌసల్య, ప్రఖ్యాత సినీనటులు నందమూరి తారకరామారావు గారి మనవరాలు నందమూరి రూపాదేవి, కొల శ్రీనివాస్, గంధం రాములు, ఎల్.ప్రసన్నకుమార్, వినయ్ హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

2024లో విడుదలై ఘనవిజయాలను సాధించిన సినిమాల్లో కృషి చేసిన గీతరచయితలను, సంగీతదర్శకులను, గాయనీగాయకులను, సౌండ్ ఇంజనీర్లను... ఇలా పాట రూపుదిద్దుకోవడానికి శ్రమపడే ప్రతి కళాకారున్ని ఎంతో వైభవంగా సన్మానించారు. భవిష్యత్తులో ఇలాగే ఆర్.వి.రమణమూర్తి ఆశయాల మేరకు కళావేదిక నిరంతరం పాటుపడుతోందని భువన తెలియజేశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com